గురువారం
8-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 166
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## ప్రకృతి లేకుంటే మనుగడే లేదు

ప్రకృతి లేకుండా మానవాళి మనుగడ సాధ్యం కాదని, ప్రకృతి వనరులను ఖాళీ చేస్తూ జేబులు నింపుకోవడాన్ని బహుళజాతి కంపెనీలు మానుకోవాలని, ప్రకృతి పరిరక్షణకు అన్ని దేశాలు ఏకం కావాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ నొక్కిచెప్పారు.

2 లో

# ఎంపీ, ఎమ్మెల్యేలపై సీబీఐ కేసులు

## ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానం

**న్యూఢిల్లీ:** ప్రజాప్రతినిధులపై ఐదేళ్లుగా నమోదైన సీబీఐ కేసులు ఆంధ్రప్రదేశ్‌లోనే అధికమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు డీఓపీటీ మంత్రి జితేంద్రసింగ్ ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. 2017-21లో ఆంధ్రప్రదేశ్‌లోనే 10 సీబీఐ కేసులు నమోదయ్యాయని తెలిపారు.

ఆ తర్వాత స్థానంలో ఆరు కేసుల చొప్పున ఉత్తరప్రదేశ్, కేరళ రాష్ట్రాలు నిలిచాయన్నారు. అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్లో ఐదు కేసులు చొప్పున నమోదు కాగా, తమిళనాడులో నాలుగు కేసులు కొత్తగా వచ్చినట్టు పేర్కొన్నారు. 2017 నుంచి 2022 అక్టోబరు నాటికి దేశవ్యాప్తంగా 56 సీబీఐ కేసులు నమోదైనట్టు వెల్లడించారు. వాటిలో 22 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్టు తెలిపారు. సీబీఐ కేసుల్లో 2017లో 66.90 శాతం శిక్ష రేటు నమోదు కాగా 2018లో 68శాతం, 2019లో 69.19 శాతం, 2020లో 69.83శాతం, 2021లో 67.56శాతంగా ఉన్నట్టు డీఓపీటీ వెల్లడించింది.

# రాష్ట్రాలే సమన్వయం చేసుకోవాలి

## పోలవరం ముంపు పిటిషన్లపై సుప్రీంకోర్టు

### ఫిబ్రవరి 15కి విచారణ వాయిదా

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** పోలవరం ముంపుపై పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారించింది. పోలవరంతో తమ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పిటిషనర్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించలేదని కోర్టుకు తెలిపారు. ఈ అంశంపై రెండు నెలల్లోగా నివేదిక ఇస్తామని సీడబ్ల్యూసీ న్యాయవాది పేర్కొనగా ఏకాభిప్రాయం సాధనకు సీఎంల సమావేశానికి యత్నించాలని సుప్రీంకోర్టు సూచించింది. ముంపుతో నష్టపోతున్నందున పోలవరం పనులు ఆపాలని పిటిషనర్లు కోరగా సీడబ్ల్యూసీ అలా చేయలేదని, రాష్ట్రాలే సమన్వయం చేసుకోవాలని పేర్కొంది. తదుపరి విచారణను ఫిబ్రవరి 15కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## నోట్ల రద్దుపై రికార్డులు

# సమర్పించండి

### కేంద్రం, ఆర్‌బీఐకి సుప్రీం ఆదేశాలు...తీర్పు రిజర్వు

**న్యూఢిల్లీ:** ఆరేళ్ల క్రితం నాటి నోట్ల రద్దును సవాల్ చేస్తూ దాఖలైన అనేక పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ ముగించింది. రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేస్తూ 2016లో తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించాలని మోదీ సర్కారు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. అనంతరం ఈ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. దీనికి అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి స్పందిస్తూ...సంబంధిత రికార్డులను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తానని తెలిపారు. 2016 నవంబరు 8న రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో 58 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ ఎస్ఏ నజీర్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కొంతకాలంగా విచారణ జరిపింది. అయితే నోట్ల రద్దు నిర్ణయంపై న్యాయ సమీక్ష అవసరం లేదని గత విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వాదించింది. కేవలం నల్లధనం కోణంలోనే కాకుండా, విస్తృత కోణంలో నాటి నిర్ణయాన్ని చూడాలని, ఏదైనా పనిలో ఒకరు విఫలమైనంత మాత్రాన.. ఆయన ఉద్దేశం లోపభూయిష్టమైనదని చెప్పడం సరికాదుని కేంద్రం తరపున ఏజీ చెప్పుకొచ్చారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

# గెలుపు ఎవరిది?

గుజరాత్, హిమాచల్ ఓట్ల లెక్కింపు నేడు
ఫలితాలపై ఉత్కంఠ

2 లో

## ఎన్ఆర్ఐలో అన్నీ

# అవకతవకలే

- ఇతర అవసరాలకు సొసైటీ నిధుల మళ్లింపు
- ఇందుకోసం ఎన్ఆర్ఐఏఎస్ అనే మరో సంస్థ ఏర్పాటు
- రోగుల నుంచి వసూళ్లకు, సంస్థ లెక్కలకు పొంతన లేదు
- వైద్య విద్యార్థులు, కోవిడ్ బాధితుల నుంచి భారీ మొత్తంలో వసూళ్లు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల వెల్లడి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** భవనాల నిర్మాణాలకు, ఇతర అవసరాలకు ఎన్ఆర్ఐ సొసైటీకి చెందిన నిధులు మళ్లించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రకటించింది. కోవిడ్ సమయంలో రోగుల నుంచి వసూలు చేసిన మొత్తానికి, సంస్థ చూపిస్తున్న లెక్కలకు పొంతనలేనట్లు ధృవీకరించింది. ఎంబీబీఎస్, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వైద్య విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఈడీ తేల్చింది. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈనెల 2, 3 తేదీల్లో ఈడీ రెండు రోజులపాటు విస్తృత తనిఖీలు, సోదాలు చేపట్టింది. ఢిల్లీ నుంచి నేరుగా వచ్చిన ఈడీ బృందాలు 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఆ రోజు అర్ధరాత్రి వరకు సోదాలు కొనసాగించింది. మరుసటి రోజు ఉదయం 8 గంటలకే రెండు బృందాలుగా ఏర్పడిన అధికారులు ఆసుపత్రిలోని అన్నిరకాల రికార్డులు పరిశీలించారు. అకౌంట్స్, హెచ్‌ఆర్ అధికారుల నుంచి ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. తనిఖీలు ముగించుకుని

- మిగతా 2 లో

# బీజేపీ పరాజయం

- ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో 134 స్థానాల్లో ఆప్ విజయం
- కమలానికి 104 స్థానాలు
- 9కి దిగజారిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో కమలనాథులకు పెద్దఎదురు దెబ్బ తగిలింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో 15 ఏళ్ల బీజేపీ పాలనను ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చీపురుతో ఊడ్చేసింది. బుధవారం వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో సీఎం అరవింద్ కేజ్రీవాల్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. మొత్తం 250 వార్డుల్లో మెజార్టీ మార్క్(126)ను దాటి, ఆప్ 134 స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో మేయర్ కుర్చీ ఆమ్ ఆద్మీ వశమైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ 104 వార్డులు గెలుచుకుంది. బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా నియోజకవర్గం పటేల్ నగర్‌లోని నాలుగు వార్డుల్లోనూ కాషాయ పార్టీ ఓటమిపాలైంది. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా చతికిలపడింది. హస్తం పార్టీ కేవలం తొమ్మిది స్థానాలకు పరిమితమైంది. మరో మూడు చోట్ల ఇతరులు విజయం సాధించారు. 1958లో ఏర్పాటైన ఎంసీడీని 2012లో నాటి ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేశారు. తిరిగి వాటిని ఈ ఏడాది విలీనం చేసి ఎంసీడీగా పునరుద్ధరించారు. మే 22 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఢిల్లీ మున్సిపల్ పీఠంపై 15 ఏళ్లపాటు బీజేపీనే అధికారంలో ఉంది. 2017 మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ 181 స్థానాల్లో గెలుపొందింది. ఆప్ 48, కాంగ్రెస్ 27 వార్డులు కైవసం చేసుకున్నాయి. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడనున్న వేళ.. ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆప్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. పార్టీ కార్యాలయం వద్ద ఆప్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల్లో విజయంపై ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

**కేంద్రం సహకారం...మోదీ ఆశీస్సులు కావాలి: కేజ్రీవాల్**

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుపై ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తంచేశారు. తమ పార్టీకి ఘన విజయం అందించిన ఢిల్లీవాసులకు కృతజ్ఞతలు చెప్పారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించే బాధ్యతను 'మీ కొడుకు, సోదరుడి'కి అప్పగించినందుకు కృతజ్ఞతలు అని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలోని ఆప్ ప్రధాన కార్యాలయంలో

- మిగతా 2 లో

## 34 మంది సజీవ సమాధి

కొలంబియాలో విరిగిపడ్డ కొండచరియలు

2 లో

# పోరాటాలే సమస్యలకు పరిష్కారం

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు
- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- ఒంగోలులో కదం తొక్కిన కార్మికులు

**విశాలాంధ్ర-ఒంగోలు:** కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, చట్టాలు ఆషామాషీగా రాలేదని, ఎందరో త్యాగధనుల పోరాటాలు, త్యాగాల ఫలితమేనని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర నాలుగో మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలులో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిర్ల కృష్ణారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఓబులేసు మాట్లాడుతూ... ప్రస్తుత ప్రభుత్వాలు కార్మికులపై ప్రేమ ఉన్నట్లు నటిస్తూ అరకొర ప్రకటనలతో పోరాటాలపై నీళ్లు చల్లుతూ దొడ్డి దారిన మన హక్కులను

- మిగతా 2 లో

## ఉపాధ్యాయులతో ఆడుకుంటే

# తిరుగుబాటే!

- 'ఎస్టీయూ' నిరసన గళం
- మార్మోగిన కలెక్టరేట్లు
- రాష్ట్ర వ్యాప్త ధర్నాల విజయవంతం
- ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై నిలదీత
- అధికారులకు వినతుల వెల్లువ
- అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం, ఆంధ్రప్రదేశ్ (ఎస్టీయూ-ఏపీ) అధ్వర్యంలో చేపట్టిన ధర్నాలు, నిరసనలు విజయవంతమైంది. జిల్లా కలెక్టరేట్లు ఎస్టీయూ నిరసనలతో మారుమోగాయి. ఎస్టీయూ

- మిగతా 2 లో

## నవరత్నాల్లో కోనేరు కమిటీ

# సిఫార్సులు చేర్చాలి

- 21న రాష్ట్ర భూ సాధన సదస్సు
- పేదల సాగు, నివాస భూములకు పట్టాలివ్వాలి
- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

10లో

# సింగరేణిపై మాటల యుద్ధం

### వేలానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, టీఆర్‌ఎస్ ఎంపీల ఆందోళన

సింగరేణిలోని నాలుగు బ్లాకుల వేలాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ ఎంపీ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం లోక్‌సభలో డిమాండ్ చేశారు. తెలంగాణలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ఆధ్వర్యంలోని బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ వాటిని రాష్ట్ర పరిధిలోని సంస్థకు కేటాయించాలని జిరో అవర్‌లో ఉత్తమ్ డిమాండ్ చేశారు.

2లో

## ఇదీ లోకం!

# 34 మంది సజీవ సమాధి

## కొలంబియాలో విరిగిపడ్డ కొండచరియలు

**బొగొటా:** కొలంబియాలో కొండచరియలు విరిగిపడి ఓ బస్సు బురదలో కూరుకున్న ఘటనలో మృతుల సంఖ్య 34కు పెరిగింది. 34 మంది సజీవ సమాధి కాగా మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. సహాయక చర్యలు ముగిసినట్లు ప్రకటించారు. భారీ వర్షాల ధాటికి కొండ చరియలు విరిగిపడి బస్సు మొత్తం బురదలో కూరుకుపోగా మరో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు ఉన్నారని జాతీయ విపత్తు నిర్వహణ విభాగం తెలిపింది. రిసరాల్డా జిల్లాలోని ప్యూబ్లో రికో నగరంలో ఈ దుర్ఘటన జరిగింది. బురద ఉప్పొంగి రహదారి రెండుగా చీలిపోగా ట్రాఫిక్ స్తంభించింది. రెండు మీటర్ల లోతు బురదలో కూరుకున్న బస్సులో 34 మంది ప్రయాణికులు ఉండగా ఓ కారులోని ఆరుగురు, ద్విచక్రవాహనంపై ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రెస్క్యూ సిబ్బంది 70 మంది నిర్విరామంగా సహాయకచర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీశారు. కొలంబియా అధ్యక్షుడు గుస్టావో పెట్రో ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా నిలుస్తామని హామీనిచ్చారు. ఘటనాస్థలి నుంచి 34 మృతదేహాలను వెలికి తీసినట్లు గవర్నర్ రిసరాల్డా విక్టర్ మాన్యుల్ టమాయో ధ్రువీకరించారు.

# సింగరేణిపై మాటల యుద్ధం

**విశాలాంధ్ర–హైదరాబాద్:** సింగరేణిలోని నాలుగు బ్లాకుల వేలాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ ఎంపీ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం లోక్‌సభలో డిమాండ్ చేశారు. తెలంగాణలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ఆధ్వర్యంలోని బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ వాటిని రాష్ట్ర పరిధిలోని సంస్థకు కేటాయించాలని జీరో అవర్‌లో ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై తెలంగాణకు చెందిన కాంగ్రెస్, టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన చేశారు. దీనిపై కేంద్ర బొగ్గు,గనుల మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందించారు. రెండేళ్లుగా వేలం ప్రక్రియ పాదర్శకంగా సాగుతోందన్నారు. బొగ్గు కుంభకోణాలకు పాల్పడే వారు ఈ ప్రక్రియను వద్దంటారని విమర్శించారు. గనుల వేలం కొనసాగుతోందని, ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికే వెళుతుందని చెప్పారు. ఎస్‌సీసీఎల్‌లో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల వాటా 51:49గా ఉందని గుర్తుచేశారు. గనుల వేలంపై ఇప్పటివరకు ఎవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. మొత్తం ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నామని, దీనికి అంగీకరిస్తే తెలంగాణ ప్రభుత్వానికి ప్రయోజనం ఉంటుందని ఆయనన్నారు. ఈ విషయంలో జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ సహా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమకు సహకరిస్తున్నాయని తెలిపారు. వేలం ద్వారా వచ్చే ఆదాయం మొత్తం రాష్ట్ర ప్రభుత్వాలకే వెళుతుందని చెప్పారు. మరోవైపు సింగరేణిలో కేంద్రం వాటాను బీజేపీ ప్రభుత్వం అమ్మేస్తోందని టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కొంటామని అడిగినా తమ ప్రతిపాదనలను పట్టించుకోవడం లేదని, ఇది తీవ్రమైన సమస్య అని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ఆ గనుల వేలం ప్రక్రియను ఆపాలని, వాటిని తెలంగాణ ప్రభుత్వానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని.. అందులో భాగంగానే సింగరేణిలోని వాటాను కూడా విక్రయిస్తోందని మరో ఎంపీ రంజిత్ రెడ్డి అన్నారు. 20 ఏళ్ల నుంచి లాభాల్లో ఉన్న సింగరేణి గనులను వేలం వేయడాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి తప్పుబట్టారు. ఇటీవల తెలంగాణకు వచ్చిన ప్రధాని మోదీ తాము సింగరేణిని ప్రైవేటీకరించబోమని అన్నారని.. కానీ జరుగుతున్నది మాత్రం అందుకు భిన్నంగా ఉందని ఆయన ఆరోపించారు. వెంటనే సింగరేణి గనుల వేలం విషయంలో తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రైవేటుకు అప్పగించడం లేదని కేంద్రమంత్రి వెల్లడించారు. అటువంటి ప్రతిపాదనలు లేవని చెప్పారు. ఇవన్నీ తప్పుడు ఆరోపణలు, నిరాధారమైన వ్యాఖ్యలంటూ తోసిపుచ్చారు.

# ప్రకృతి లేకుంటే మనుగడే లేదు

- దానిపై యుద్ధం వద్దు- ఐక్యంగా పరిరక్షించుకుందాం
- కాప్15 సదస్సులో ఆంటోనియో గుటెర్రస్ పిలుపు
- పర్యావరణ వ్యవస్థలు ఆటవస్తువులు కాదు
- బహుళజాతి కంపెనీల తీరు ఆక్షేపణీయం : ఐరాస ప్రధాన కార్యదర్శి
- మాంట్రియల్‌లో ప్రారంభమైన శిఖరాగ్ర సమావేశం - హాజరైన 196 దేశాల ప్రతినిధులు

**మాంట్రియల్:** ప్రకృతి లేకుండా మానవాళి మనుగడ సాధ్యం కాదని, ప్రకృతి వనరులను ఖాళీ చేస్తూ జేబులు నింపుకోవడాన్ని బహుళజాతి కంపెనీలు మానుకోవాలని, ప్రకృతి పరిరక్షణకు అన్ని దేశాలు ఏకం కావాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ నొక్కిచెప్పారు. ఆయన బుధవారం ఐక్యరాజ్య సమితి జీవవైవిధ్యత సదస్సు (కాప్ 15)లో ప్రసంగించారు. ప్రకృతిపై యుద్ధం ఆపండి... దాని పరిరక్షణకు ఏకం కండి' అని ప్రపంచ దేశాలకు హితవు పలికారు. ప్రకృతి మానవజాతికి ప్రాణ స్నేహితుడు వంటిదని, అది లేకుండా మానవ మనుగడ సాధ్యం కాదన్నారు. బహుళజాతి కంపెనీలు సహజవనరులను కొల్లగొడుతూ, ప్రకృతిని ఖాళీ చేస్తూ బ్యాంకులు నింపుకుంటున్నారని, పర్యావరణ వ్యవస్థలను లాభాల కోసం ఆట వస్తువులుగా మార్చాయని దుయ్యబట్టారు. అల్పసంఖ్యాక సంపన్నుల చేతిలో ధనం–అధికారం పరిమితం కావడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ధోరణి ప్రకృతికి విరుద్ధమని నొక్కిచెప్పారు. మెజారిటీ ప్రజల ప్రయోజనాలతో పనిలేకుండా కేవలం కొందరు సంపన్నుల కలలు సాకారం కోసం ప్రకృతి అంతమైతే మన కోసం ప్లానెట్ బీ (మరొక భూగోళం) లేదని గుటెర్రస్ అసహనం వ్యక్తంచేశారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడ్యూ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రకృతికి ముప్పు పొంచి ఉన్నదన్నారు. ప్రకృతిపై దాడులు జరుగుతున్నాయని, మనం ప్రపంచంగా చేస్తున్నది ఏ మాత్రం చాలదని అన్నారు. ప్రకృతి పరిరక్షణకు కెనడా కట్టుబడి ఉన్నదని, 2030 నాటికి ప్రకృతిలో 30శాతాన్ని కాపాడేందుకు అంగీకరించిందని ట్రుడ్యూ చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చైనా పర్యావరణ మంత్రి హువాంగ్ రున్కియు ... కాప్ 15కు ఆతిథ్యమిచ్చినందుకు కెనడాకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది చరిత్రాత్మక క్షణం, సత్వరమే చర్య అవశ్యం అని ఆయనన్నారు.

కాప్–15 సదస్సులో భాగంగా ప్రకృతికి జరిగిన నష్టాన్ని 2030 నాటికి ఆపే విధంగా చరిత్రాత్మక ఒప్పందంపై భారత్‌తో సహా 196 దేశాల నాయకులు, రాయబారులు చర్చిస్తారు. జీవవైవిధ్యం పరిరక్షణ, పునరుద్ధరణకు ఎనిమిదేళ్ల ప్రణాళికపై ప్రపంచ దేశాలకు చెందిన 20వేల మంది ప్రతినిధులు సమాలోచనలు జరిపి కన్వెన్షన్ ఆన్ బయోలాజికల్ డైవర్సిటీ (సీబీడీ) ఒప్పందాన్ని ఆమోదిస్తారు. 2030 నాటికి ప్రపంచంలోని 30శాతం భూమి–నీటిని పరిరక్షించడం, వనరుల ప్రయోజనాల్లో సమాన వాటా తదితర కీలకాంశాలపై ప్రతినిధులు కూలంకుషంగా చర్చిస్తారు. ప్రతి రెండేళ్లకు ఈ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహిస్తారు. ప్రపంచ జీవవైవిధ్య నూతన కార్యాచరణ ప్రణాళిక జరగనున్న క్రమంలో పదేళ్లలోనే అతిపెద్ద పెద్ద సదస్సుగా ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. 2010లో జనాప్, నగోయాలో కాప్10 సదస్సు జరిగింది. అప్పటి లక్ష్యాల్లో ఏ ఒక్కటీ పూర్తి కాలేదని సీబీడీ నివేదిక2020 ద్వారా తెలుస్తోంది. 2020 నాటికి భూమిలో కనీసం 17శాతాన్ని పరిరక్షించాలన్న ప్రపంచ కనీస లక్ష్యసాధనలో ఆసియాలోని దాదాపు అన్ని దేశాలు పూర్తిగా విఫలమైనట్లు 40 దేశాలపై జరిపిన తాజా అధ్యయనం ద్వారా వెల్లడైంది.

# నేపాల్ అధికార కూటమికి దక్కని మెజారిటీ

**ఖాట్మండు:** నేపాల్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడ్డాయి. సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అధికార కూటమికి మరో రెండు స్థానాలు తగ్గాయి. 275 సభ్యులు ఉన్న ప్రతినిధుల సభలో అధికార కూటమికి మొత్తంగా 136 స్థానాలు వచ్చాయి. మెజారిటీ రావాలంటే మరో రెండు స్థానాలు అవసరమయ్యాయి. అధికార కూటమికి నేపాలీ కాంగ్రెస్ నేతృత్వం వహిస్తోంది. ప్రతినిధుల సభలో ఏకైక పెద్దపార్టీగా నేపాలీ కాంగ్రెస్ ఆవిర్భవించింది. 89 స్థానాలను కైవసం చేసుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యునిఫైడ్ మార్క్సిస్ట్, లెనినిస్ట్) 78 సీట్లు గెలుచుకుంది. అధికార పార్టీకి మిత్రపక్షంగా ఉన్న నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్ సెంటర్) 32 స్థానాలతో మూడవ స్థానంలో నిలిచింది. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యూనిఫైడ్ సోషలిస్ట్) 10 సీట్లు గెలుచుకొని ఏడవ స్థానంలో ఉంది. లోకతాంత్రిక్ సమాజ్‌వాదీ పార్టీకి నాలుగు సీట్లు దక్కగా, రాష్ట్రీయ జనమోర్చా ఒక స్థానంతో సరిపెట్టుకుంది. ఈసారి దిగువసభలోకి 12 పార్టీల ప్రతినిధులు అడుగుపెట్టనున్నారు. కొత్తగా ఏర్పాటైన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ 20 స్థానాలు గెలుచుకొని నాల్గో పెద్దపార్టీగా ఆవిర్భవించింది. 'ఓట్ల లెక్కింపు, సీట్ల కేటాయింపు మొత్తం పూర్తి అయిందని, దామాషా పద్ధతిలో తమ శాసనసభ్యుల పేర్లను రాతపూర్వకంగా అందజేయాలని పార్టీలకు సూచించామని ఎన్నికల కమిషన్ వెల్లడించింది.

# గెలుపు ఎవరిది?

**న్యూఢిల్లీ:** హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో గెలుపోటములు ఆస్తికరంగా మారాయి. బీజేపీ కంచుకోటను కాంగ్రెస్ లేక ఆప్ బద్దలు కొట్టగలవా అన్నది ప్రధాన ప్రశ్నగా ఉంది. ఎగ్జిట్ పోల్స్ తారుమారై ఫలితాలు వెలువడతాయా అన్న కోణం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. హిమాచల్ ప్రదేశ్ సంప్రదాయం ప్రకారం ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. మరి ఆచారాన్ని అనుసరిస్తారా లేక బీజేపీ నినాదం 'పరిపాలన కాదు.. ఆచారం మారుతుంది' (రాజ్ నహీ రివాజ్ బదలేగా) పరిస్థితి ఉంటుందా అన్నది ఉత్కంఠ రేపుతోంది. అధికారంలో ఉన్న పార్టీ మరోమారు రాష్ట్ర పగ్గాలు చేపట్టినట్లు 1985 తర్వాత హిమాచల్ ప్రదేశ్‌లో జరగలేదు. రాష్ట్రంలో 55లక్షల మంది ఓటర్లు ఉండగా నవంబరు 12న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 75శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. మొత్తం 412 మంది పోటీ చేశారు. హిమాచల్ ప్రదేశ్‌పై కాంగ్రెస్ ఆశలు పెట్టుకున్నది. ఎలాగైనా అధికారంలోకి రావాలని సంకల్పించి పెద్దఎత్తున ప్రచారం నిర్వహించింది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పాత పింఛన్ పథకం తదితర ప్రజా సమస్యలపై గళమెత్తింది. ఓటర్లను తమ వైపుకు తిప్పుకునే ప్రయత్నం చేసింది. గెలుపుపై ధీమాగా ఉన్నది. ఈసారి ఓట్లవాటా పెరుగుతుందని ఆకాంక్షిస్తోంది. రాజస్థాన్,ఛత్తీస్‌గఢ్‌లో మాత్రమే సొంతంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ హిమాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలమన్న విశ్వాసాన్ని కనబరుస్తోంది. తమ బలాన్ని పెంచుకునేందుకు స్వతంత్ర అభ్యర్థులతో బీజేపీ, కాంగ్రెస్ మంతనాలు సాగిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో తిరిగి అధికారంలోకి రాగలమని బీజేపీ భావిస్తోంది. మహిళా ఓటర్లపై ఆశలు పెట్టుకుంది. ఆప్ నేత సత్యేంద్ర జైన్ జైల్లో ఉండటంతో ఈ పార్టీ ప్రచారంలో రాణించలేదు. బీజేపీ తరపున మోదీ ప్రత్యేక ర్యాలీలు నిర్వహించారు. గుజరాత్‌లో 30కుపైగా ర్యాలీలు, రోడ్‌షోలలో పాల్గొన్నారు. కేంద్రమంత్రి అమిత్‌షా రెండు నెలల పాటు ఆ రాష్ట్రంలోనే ఉండి ఎన్నికల ప్రచార వ్యూహకర్తగా వ్యవహరించగా దాదాపు కేంద్రమంత్రులంతా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నుంచి విరామం తీసుకొని గుజరాత్‌లో రెండు ర్యాలీల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో పార్టీ ప్రచార సారథిగా రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోట్ వ్యవహరించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ర్యాలీల్లో ప్రసంగించారు. మరోవైపు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో ఆప్ ప్రచార ర్యాలీలు, రోడ్‌షోలు సాగాయి.

**మూడంచెల భద్రత...**

ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి పి.భారతి తెలిపారు. ఓట్ల లెక్కింపుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మూడంచెల భద్రతా వ్యవస్థను ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారని, స్థానిక పోలీసులు, ఎస్ఆర్‌పీఎఫ్, సీఏపీఎఫ్ పహారా ఉంటుందని సీఈఓ భారతి తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఉదయం 8 గంటల నుంచి జరుగుతుందని, 8.30 గంటల తర్వాత ఈవీఎం ఓట్లను లెక్కిస్తారని, మొత్తం ప్రక్రియను వీడియో తీస్తారని చెప్పారు. ఆమె బుధవారం అహ్మదాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ గుజరాత్‌లో 182 అసెంబ్లీ స్థానాలకుగాను 37 లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అహ్మదాబాద్‌లో మూడు కేంద్రాలు, సూరత్, ఆనంద్‌లో చెరో రెండు, మిగతా 30 జిల్లాల్లో ఒకటి చొప్పున ఏర్పాటు చేశామన్నారు. 494 మంది అసిస్టెంట్ ఎన్నికల అధికారులతో పాటు అనేకమంది ఎన్నికల అధికారులు విధుల్లో ఉంటారని ఆమె అన్నారు.

# పోరాటాలే సమస్యలకు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

లాగేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చిన సీం జగన్ అందుకు విరుద్ధంగా ఆబ్కాస్ తెరమీదకి తెచ్చారన్నారు. మూడో వ్యక్తితో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వం జీతాలు ఇస్తుందని నమ్మబలికారని, ఇప్పుడేమో ఔట్‌సోర్సింగ్ కార్మికులను తొలగించేందుకు మెమో జారీ చేశారని విమర్శించారు. కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెంటనే మంత్రి స్పందిస్తూ ఇది సీఎంకి తెలియకుండా జరిగిందని చెబుతూ మెమో జారీచేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారన్నారు. ముఖ్యమంత్రి జగన్ కి తెలియకుండా ఔట్‌సోర్సింగ్ కార్మికుల మెమో బయటకు వచ్చిందా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ప్రతిపక్షనేతగా జగన్ ఇచ్చిన హామీలను పోరాటాల ద్వారా మాత్రమే సాధించుకోగలమన్నారు. ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్ సూచించిన కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన సాగుతోందని, కేవలం డబ్బుల ద్వారానే తిరిగి అధికారంలోకి వస్తామని జగన్ నమ్మకంతో ఉన్నారన్నారు. అందుకే కార్మిక హక్కులను, చట్టాలను తుంగలో తొక్కి పాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రతి మున్సిపల్ కార్మికుడికి జగనన్న కాలనీలో ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమ గర్జన ఎవరికోసమో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులైన అంబానీ ,అదానీల ఆదాయాల పెంపుకోసమే పనిచేస్తున్నాయని, అందుకు కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గం అని తేల్చి చెప్పారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ సమ్మె సమయంలో కూడా జీతాలు సాధించుకొన్న చరిత్ర ఏఐటీయూసీదేనన్నారు. ప్రభుత్వ విధానాలతో అనేక కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఐక్య పోరాటాల ద్వారానే కార్మికులు తమ హక్కులను సాధించుకోవడంతోపాటు, ఇప్పటివరకు ఉన్న చట్టాలను కాపాడుకోగలరని చెప్పారు. తొలుత ఏఐటీయూసీ సీనియర్ నాయకులు అందే నాసరయ్య ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఒంగోలు పట్టణంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తులసేంద్ర, రాష్ట్ర గౌరవ సలహాదారుడు నెక్కంటి సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రంగనాయకులు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి.రవి, రాష్ట్ర కోశాధికారి మల్లేశ్వరరావు, సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐలో అన్నీ అవకతవకలే

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లేటప్పుడు అధికారులు కొన్ని కీలక రికార్డులను, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ల కేసు షీట్లను తీసుకెళ్లారు. ఈ తనిఖీలకు సంబంధించిన వివరాల గురించి ఈడీ బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఎన్ఆర్ఐ సంస్థలోనే కాకుండా విజయవాడ, కాకినాడ, గుంటూరు, హైదరాబాద్‌ల్లోని డైరెక్టర్ల ఇళ్లల్లో జరిపిన సోదాల్లో కొంత నగదు, కీలకపత్రాలు సీజ్ చేసినట్లు వెల్లడించింది. కొందరు వ్యక్తులకు సంబంధించిన కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ పోలీసులు నమోదు చేసిన మనీలాండరింగ్ కేసు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఈడీ తెలిపింది. అకౌంట్స్ బుక్స్‌లో పేర్కొన్న గణాంకాల కంటే ఎక్కువగా వసూలు చేసినట్లు గుర్తించినట్లు ఈడీ తెలిపింది. ఎన్ఆర్ఐఏఎస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో మరో కంపెనీని రూపొందించి దాని ద్వారా ఎన్ఆర్ఐ సొసైటీకి చెల్లించాల్సిన నిధులను మళ్లించారు. మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు అనుమానిస్తున్న స్థిరాస్తులకు చెందిన మొత్తం 53 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటి క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండా స్తంభింపజేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. నిధుల మళ్లింపుతో సంబంధం ఉన్న అనేక ఇతర నేరారోపణ పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# ఆర్‌బీఐ వడ్డీరేట్లు పెంపు

**ముంబై:** వాణిజ్య వర్గాలు, విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)ఈసారి వడ్డీ రేట్లను 35 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. దీంతో రెపోరేటు 6.25 శాతానికి చేరింది. సోమవారం ప్రారంభమైన ద్రవ్య పరపతి కమిటీ సమావేశ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ బుధవారం ప్రకటించారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టే సంకేతాలు కనిపించడం, ఆర్థిక వృద్ధి నెమ్మదించడంతో రేట్ల పెంపు వేగాన్ని ఈసారి ఆర్‌బీఐ కాస్త తగ్గించింది. తాజా పెంపుతో అన్ని రకాల రుణాలు మరింత భారం కానున్నాయి. ప్రస్తుతం రెపోరేటు 2018 ఆగస్టు నాటి స్థాయికి చేరింది. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని శక్తికాంత దాస్ తెలిపారు. కార్పొరేట్ వ్యవస్థ పటిష్ఠంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం మెరుగైన స్థాయిలో ఉందని తెలిపారు. ద్రవ్యోల్బణ కట్టడి లక్ష్యంగా కేంద్ర బ్యాంకు రెపోరేటును ఇప్పటి వరకు ఈ ఏడాది 225 పాయింట్లు పెంచింది. దీంతో మేలో 4.4 శాతంగా ఉన్న కీలక వడ్డీరేటు ఇప్పుడు 6.25 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం మరికొంత కాలం లక్షిత 4 శాతానికి ఎగువనే ఉండనుందని దాస్ స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తగ్గుముఖం పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా తమ పోరాటం ఇంకా ఆగలేదని చెప్పుకొచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం 6.7 శాతానికి ఎగువనే ఉంటుందని అంచనా వేశారు.

# బీజేపీ పరాజయం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. మున్సిపల్ ఎన్నికల్లో మార్పు తీసుకొచ్చినందుకు ప్రజలకు ధన్యవాదాలు చెప్పిన కేజ్రీవాల్...ఢిల్లీ ప్రజల ఆకాంక్షలను సాకారం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఢిల్లీ నగర పరిస్థితిని మరింత మెరుగుపరిచేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ఆశీర్వాదం కావాలన్నారు. పరిశుభ్రమైన నగరంగా ఢిల్లీని తీర్చిదిద్దేందుకు రాజకీయ పార్టీలన్నీ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన ఆప్, బీజేపీ, కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి, లంచగొండితనాన్ని నిర్మూలించి అవినీతి రహితంగా మారుస్తామన్నారు. తమ తీర్పుతో ఢిల్లీ ప్రజలు యావత్ దేశానికి ఓ సందేశం ఇచ్చారని కేజ్రీవాల్ పేర్కొన్నారు. అంతకముందు డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా మాట్లాడుతూ...ఆప్‌ను గెలిపిస్తూ తీర్పు ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఆప్‌కు ఇచ్చింది కేవలం విజయం మాత్రమే కాదని.. ఢిల్లీని మరింత పరిశుభ్రంగా, మెరుగైన నగరంగా తీర్చిదిద్దే అతిపెద్ద బాధ్యత అన్నారు. ప్రజల తీర్పుతో తాము ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పార్టీని ఓడించగలిగామని పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీలో 15 ఏళ్ల కాంగ్రెస్ పాలనను అరవింద్ కేజ్రీవాల్ పెకిలించి వేశారని, ఇప్పుడు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో 15 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీని గద్దెదించారని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. విద్వేష రాజకీయాలను ఢిల్లీ ప్రజలు ఇష్టపడటం లేదని రుజువైందన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, విద్యుత్, పరిశుభ్రతకే ప్రజలు ఓటేశారని తెలిపారు.

**ఆప్ కార్యాలయం వద్ద కోలాహలం**

ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ కార్యాలయం వద్ద కోలాహలం నెలకొంది. పార్టీ నేతలు, కార్యకర్తల హర్షాతిరేకాలు, పాటలతో సందడి చేశారు. అక్కడికి చేరుకున్న పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పార్టీ జెండాలు పట్టుకొని మిఠాయిలు పంచుకుంటూ నృత్యాలతో ఆనందం పంచుకున్నారు. భారత్ మాతాకీ జై, ఇంక్విలాబ్ జిందాబాద్, వందేమాతరం వంటి నినాదాలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు.

# ఉపాధ్యాయులతో ఆడుకుంటే తిరుగుబాటే!

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఈ ఆందోళనలకు నాయకత్వం వహించారు. పీఆర్సీ, డీఏ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థికపరమైన అన్ని అంశాల్ని తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలంటూ నినదించారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, తుది చెల్లింపులు తదితర ప్రయోజనాలు పరిష్కారానికి నోచుకోక ఉపాధ్యాయులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్టీయూ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య విధానాలతో పిల్లల పెళ్లిళ్లు, గృహ నిర్మాణాలు వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలిపారు. జీతాలు సైతం కనీసం 1వ తేదీన తీసుకోలేని పరిస్థితి నెలకొందంటూ నినదించారు. గుంటూరుజిల్లా కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ పూర్వపు అధ్యక్షుడు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, కోనసీమ అంబేద్కర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న ధర్నాలకు నాయకత్వం వహించారు. ఉపాధ్యాయుల ఆర్థికపరమైన అంశాలు వెంటనే పరిష్కరించాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తదితర డిమాండ్లతో కలెక్టరేట్ల అధికారులకు, డీఆర్వోలకు, ఆర్డీఓలకు వినతిపత్రాలను అందజేశారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, తిమ్మన్న మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు అసంతృప్తితో రగిలిపోతున్నారని, ఉపాధ్యాయుల జీతాలు, జీవితాలతో చెలగాటం ఆడుకుంటే తిరుగుబాటు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల ఆర్థికపరమైన సమస్యలు, ప్రయోజనాల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ధర్నాలు, నిరసనల్లో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేసిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, రాష్ట్ర బాధ్యులు గురుకుమార్, దాదా పీర్, ఇలియాస్ బాషా, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టర్ కార్యాలయం ముందు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, రాష్ట్ర బాధ్యులు రమేష్ నాగరాజు ప్రసన్నరాజు, నంద్యాల జిల్లాలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అజాం బేగ్ మౌలాలి, రాష్ట్ర బాధ్యులు చంద్రశేఖర్ గోపాలకృష్ణ నాయకత్వంలో ధర్నా జరిగింది. అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్యుడు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర బాధ్యులు చంద్రశేఖర్ కృష్ణమూర్తి రామాంజనేయులు అధ్వర్యంలో డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్ ముందు జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర బాధ్యుడు హరిప్రసాద్‌రెడ్డి అధ్వర్యంలో అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యలు , విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ డీఏలు అలవెన్సులు వెంటనే మంజూరు చేయాలని ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాకు అధ్యక్షుడు దేవరాజులరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్, రాష్ట్ర బాధ్యులు ఘంటా మోహన్ పురుషోత్తం, హేమచంద్రారెడ్డి లోకనాథ్‌రెడ్డి తదితరులు నాయకత్వం వహించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు తదితరుల అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజ మనోహర్, అప్పన ఏడుకొండలు, నరసింహులు, రమేష్, కృష్ణయ్య అధ్వర్యంలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని డీఆర్వోకు మెమొరాండం సమర్పించారు.

బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా అమలాపురం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ, రాష్ట్ర బాధ్యులు దొరబాబు, ఉమాపతి శాస్త్రి, ప్రసాద్, ఆచారి నాయకత్వం వహించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి జిల్లా కలెక్టర్ ఎదుట ధర్నాకు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ రాష్ట్ర బాధ్యులు జాకబ్, త్రినాథ్, జ్యోతి, కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు జిల్లా అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ , రాష్ట్ర నాయకులు పి.సుబ్బరాజు, వెంకటేశ్వరరావు, పి.సత్యనారాయణరాజు నాయకత్వం వహించారు. విజయనగరం జిల్లా విజయనగరం కలెక్టరేట్ ముందు ఎస్టీయూ అధ్యక్షుడు శ్యామ్, ప్రధాన కార్యదర్శి అప్పారావు, జేఈ రాజు, దొరల అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు ఎస్టీయూ నాయకులు జీఎస్ రమణమూర్తి, మధుసూదన్ నాయకత్వం వహించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు యూనియన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర బాధ్యులు ఎర్రయ్య, ఆదినారాయణ ,రామాంజనేయులు, చల్ల శ్రీనివాస్ నాయకత్వం వహించారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ ముందు 80 మంది ఉపాధ్యాయులతో అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి నరసింహారావు, రాష్ట్ర బాధ్యులు రామచంద్రయ్య, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బాపట్ల కలెక్టరేట్ ఎదుట ధర్నాకు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి అమర్నాథ్, పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టరేట్ వద్ద ధర్నాకు ఎస్టీయూ అధ్యక్షుడు పెదబాబు, ప్రధాన కార్యదర్శి చందర్‌జిత్‌యాదవ్, రాష్ట్ర బాధ్యులు శుభాని, శ్రీనివాస్, కె.కోటేశ్వరావు నిరసన చేపట్టారు. ఉమ్మడి కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ ఎదుట ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇమ్మానియేల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎంవీఎస్ఎన్ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు భిక్షమయ్య, ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నారాయణ, ప్రధాన కార్యదర్శి పుష్పాల ప్రకాష్, రాష్ట్ర బాధ్యుడు శామ్యూల్ పవన్‌కుమార్ ధర్నాకు నాయకత్వం వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లా అధ్యక్షుడు జవహర్‌లాల్ రాజు, ప్రధాన కార్యదర్శి కేవీ రామచంద్రరావు, రాష్ట్ర బాధ్యులు గుత్తుల శ్రీనివాస్, బాల కుమారుల అధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

## కడప ఉక్కుకోసం...

# మలిదశ పోరాటం

### రేపటి నుంచి పాదయాత్ర

- తరలిరానున్న అన్ని పార్టీల నాయకులు
- 13న కడప కలెక్టరేట్ వద్ద ముగియనున్న యాత్ర
- తొలిరోజు నారాయణ
- చివరిరోజు డి.రాజా

**విశాలాంధ్ర బ్యూరో-కడప:** సీమలో కరువు కాటకాలపై నిలయమైన కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం 2007 జూన్ 10న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి శంకుస్థాపన చేశారు. ఉక్కు ప్రారంభోత్సవ సభలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉక్కు ఫ్యాక్టరీని జమ్మలమడుగు ప్రాంతంలో నిర్మించ తలపెట్టామని, ప్రత్యక్షంగా 28వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుందని చెప్పిన మాటలకు రాష్ట్ర ప్రజల్లో ఆశలు రేకెత్తాయి. ఉక్కు ఫ్యాక్టరీకి 14,760 ఎకరాలు భూమి కేటాయించి గాలి జనార్ధన్‌రెడ్డి కంపెనీకి స్టీల్ ఫ్యాక్టరీ నిర్మా ణాన్ని అప్పజెప్పారు. అయితే రాయలసీమ వాసుల ఆశలు అడియాసలయ్యేలా జనార్ధనరెడ్డి ఫాక్యక్టరీ నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారు. 2009 నాటికి మొత్తం ఉక్కు ఉత్పత్తిని మొదలు పెడతామన్న వైఎస్ఆర్ దురదృష్టవశాత్తు మరణించడం ఉక్కు ఫ్యాక్టరీ శాపంగా మారింది. దీంతో అక్కడ నుంచి పనులు ఎక్కడ వేసిన గొంగళి, అక్కడే అన్న చందంగా మారాయి. దీంతో 2011 నుంచి సీపీఐ ఉక్కు ఉద్యమాన్ని ప్రారంభించి అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉంది. అనేక పోరాటాల అనంతరం రాష్ట్ర విభజన జరిగిన కాలంలో పోరాటాల ఫలితంగా ఉక్కు ఫ్యాక్టరీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని సెయిల్ సంస్థ నిర్మాణం జరుగుతుందని ఆర్భాటం హామీ ఇచ్చారు. అప్పట్లో బీజేపీ ప్రభుత్వం కూడా ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి సన్నద్ధత వ్యక్తం చేసింది. కానీ అది కూడా కార్యరూపం దాల్చలేదు. అనంతరం టీడీపీ హయాంలోను జమ్మలమడుగు తాలూక కంబాలదిన్నె వద్ద ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. అనంతరం టీడీపీ కూడా చేతులెత్తేసింది. ఇక 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి నిలబెట్టుకోవ దానికి కృషిచేస్తానని రూ.20వేల కోట్ల పెట్టుబడితో సంవత్సరానికి 30లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తానని ప్రగల్భాలు పలికి కేవలం రూ.250కోట్లు నిధులు విదిల్చి సగం ప్రహారీని మాత్రం నిర్మించి పలాయనం చిత్తగించాడు. మూడేళ్ల తరువాత కూడా ఉక్కు ఫ్యాక్టరీ పనుల్లో ఎలాంటి పురోగతి కానరాలేదు. విభజన చట్టంలోని హామీల మేరకు కేంద్ర ప్రభుత్వం మీద కూడా ఒత్తిడి తెచ్చిన దాఖలాలు లేకపోవడంతో ఫ్యాక్టరీ నిర్మాణం శంకుస్థాపనలకు పరిమిత మైంది. కానీ రాయలసీమలో కరువు కొనసాగుతున్న వేళ నిరుద్యోగులకు ఉపాధి కరువై ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లే

(ఫైల్ ఫొటో)

ఘనటలు జరుగుతున్నా, ఫ్యాక్టరీ నిర్మాణంపై ముందడుగు వేయకపోవడం రాయలసీమతో పాటు రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురి చేస్తోంది. ఈ నిరాశ, నిస్పృహల నుంచి నిరుద్యోగ యువ తను కార్యోన్ముఖులను చేయడానికి, రాష్ట్ర ప్రజల కలను సాకారం చేయడానికి సీపీఐ రంగంలోకి దిగి ఉక్కు ఉద్య మాన్ని ఉగ్రరూపంగా మలిచేవిధంగా ముందడుగు వేయ నుంది. ఈక్రమంలో మలివిడతలో కూడా సీపీఐ అధ్వర్యంలో పెద్ద ఎత్తున పాదయాత్రకు సన్నద్ధమవుతోంది. ఈ పాదయాత్రకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించి పాదయాత్రలో పాల్గొనడానికి ముందడుగు వేస్తున్నాయి.

**మహా పాదయాత్ర**

ఈ పాదయాత్ర డిసెంబరు 9వ తేదీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన జమ్మలమడుగు నియోజకవర్గం కన్నెతీర్థం నుంచి ప్రారంభమై జమ్మల మడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు మీదుగా 13వ తేదీ చివరి రోజు మధ్యాహ్నం కడప కలెక్టరేట్ వద్ద ముగియనుంది. ఈ పాదయాత్ర ఐదురోజుల కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డా॥ నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఓబులేసు, ఈశ్వరయ్య, టీడీపీ, కాంగ్రెస్, జనసేన నాయకులు అచ్చెన్నాయుడు, గిడుగు రుద్రరాజు, నాదెండ్ల మనోహర్‌తో పాటు కార్మిక, కర్షక, నిరుద్యోగ యువత పాల్గొంటున్నారు. చివరి రోజు రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకాకుళం నుంచి పుట్టపర్తి వరకు ఉన్న జిల్లాల నాయకులతో సభ జరుగుతుంది. ఐదురోజుల పాదయాత్ర విజయవంతానికి యువత కదలి రావాలని సీపీఐ కోరుకుంటోంది.

## పవన్ ప్రచార రథం 'వారాహి' సిద్ధం

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఇందుకోసం సకల సౌకర్యాలతో కూడిన ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ వాహనం వీడియోను పవన్ కల్యాణ్ ట్విట్టర్లో పోస్ట్ చేశారు. 'వారాహి'... రెడీ ఫర్ ఎలక్షన్ బ్యాటిల్- అని ప్రకటించారు. ఈ వాహన ట్రయల్ రన్‌ను పవన్ బుధవారం హైదరాబాద్‌లో పరిశీలించారు. వాహనానికి సంబంధించి కొన్ని ముఖ్య సూచనలను, మార్పులను పార్టీ నాయకుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌తో, వాహనాన్ని తీర్చిదిద్దుతున్న సాంకేతిక నిపుణులతోను చర్చించారు.

**వాహనంలో విశేషాలు**

భద్రతతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వాహనాన్ని తీర్చిదిద్దారు. ప్రత్యేక లైటింగ్ సౌకర్యం, ఆధునిక సౌండ్ సిస్టం, వాహనా నికి నలువైపులా సీసీ కెమెరాలు అమర్చారు.సభ నిర్వహించే ప్రదేశంలో రికార్డు అయ్యే ఫుటేజ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్వర్‌కి రియల్ టైంలో వెళుతుంది. అలాగే వాహనంలో పవన్‌కళ్యాణ్ ఇద్దరు వ్యక్తులతో కూర్చుని మాట్లాడే ఏర్పాటు ఉంది.హైడ్రాలిక్ విధానంలో మెట్లు ఉంటాయి.

## ఎందుకు అనుమతివ్వరు?

- పోలీసు డివిజన్ కార్యాలయం వద్ద నిరసన

**విశాలాంధ్ర బ్యూరో - కడప:** ఉక్కు పాదయత్రకు అనుమతి ఎందు కివ్వరు? రాజ్యాంగ హక్కులు కాలరాస్తే సహించాలా? అని సీపీఐ కడప జిల్లా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు పరిశ్రమ కోసం పోరాడి తీరుతా మని స్పష్టం చేశారు. ఇది ప్రజాస్వామ్యమని, పోలీసు రాజ్యం కాదంటూ బుధ వారం పోలీసు డివిజనల్ కార్యాలయం ఎదుట పార్టీ నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నియోజకవర్గ కార్యదర్శి ఎన్వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో ఈనెల 9న కన్నతీర్థం నుంచి పాదయాత్రకు అనుమతిని జిల్లా ఎస్పీ, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు మైదుకూరు పోలీసు డివిజనల్ అధికారులను కోరితే అనుమతి ఎందుకు ఇవ్వలేదో తెలపాలన్నారు. పోలీసులు రాజ్యాంగానికి-చట్టానికి లోబడి పని చేయాలన్నారు. నిర్బంధాలకు పాల్పడితే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియు తంగా నిరసనలు, ప్రదర్శనలు చేపట్టే హక్కును రాజ్యాంగం కల్పించిందని, దీనిని కాలరాయటం తగదని హితవు పలికారు. కడప ఉక్కు పరిశ్రమ కోసం ముగ్గురు ముఖ్యమంత్రులు మూడు శిలాఫలకాలు మూడు పునాదిరాళ్లు వేశారే తప్ప ఏ ఒక్కరు నిర్మాణాన్ని చేపట్టలేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎల్ నాగసుబ్బారెడ్డి, రామయ్య, వీరశేఖర్, చంద్రశేఖర్, శ్రీరాములు, సుబ్రహ్మణ్యం కేసి బాదుల్లా, గంగా సురేశ్, జిల్లా సమితి సభ్యులు, జమ్మలమడుగు మండల పార్టీ కార్యదర్శి ప్రసాద్ బాలు, జక్కరయ్య, కొమ్మది ఈశ్వరయ్య, చాంద్ బాషా, రాజు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# జయప్రదం చేయండి

### జేవీ సత్యనారాయణమూర్తి, ఈశ్వరయ్య

**విశాలాంధ్ర-కడప రూరల్:** కరువు కోరల్లో సతమతమవుతున్న రాయలసీమ ప్రాంతాన్ని సుభిక్షం చేయడానికి కడప ఉక్కు ఫ్యాక్టరీని సత్వరమే నిర్మించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. జమ్మలమడుగు వద్దనున్న కన్యాతీర్థం నుంచి కడప కలెక్టరేట్ వరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నేతృత్వంలో పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ పాదయాత్ర రాయలసీమ ప్రాంతానికే కాకుండా మొత్తం రాష్ట్రానికి వర్తిస్తుందని తెలిపారు. మొదటి రోజు పాదయాత్రలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, వివిధ రాజకీయ పక్షాల రాష్ట్ర నేతలు పాల్గొంటారనీ, రెండోరోజు సీపీఐ రాజ్యసభ సభ్యుడు బినయ్ విశ్వం, 13న కలెక్టరేట్ వద్ద మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి డీ రాజా తదితరులు హాజరవుతారన్నారు. రాష్ట్ర విభజన చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని వంచనకు గురి చేసింద న్నారు. పాదయాత్ర సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఏపీపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, తులసిరెడ్డి, జనసేన నేత నాదెండ్ల మనోహర్ పాల్గొననున్నారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రూ.20 వేల కోట్లతో 30 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తామని నిర్మించి చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. కాంపౌండ్ నిర్మిం చిన కాంట్రాక్టర్‌కు బిల్లులు, భూములు ఇచ్చిన రైతు లకు నష్టపరిహారం చెల్లించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. వైసీపీ నాయకు లకు చిత్తశుద్ధి ఉంటే పాదయాత్రకు అడ్డంకులు సృష్టించకుండా వారు కూడా పాద యాత్రలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ నుంచి జగన్ వరకు రాష్ట్రాన్ని నడిపిన పాలకులు ఉక్కు ఫ్యాక్టరీకి రిక్త హస్తాలు చూపించారని, ఫ్యాక్టరీ నిర్మాణానికి ఏమాత్రం చిత్తశుద్ధితో ముందుకు వెళ్లలేదని విమర్శించారు. విశాఖ ఉక్కును కూడా ప్రైవేట్ పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తపనప డుతోందని, విశాఖ ఉక్కును రూ.5వేల కోట్లతో ప్రారంభిస్తే ప్రస్తుతం ప్రభుత్వా నికి రూ.48 వేల కోట్లు ప్రభుత్వానికి చెల్లించిందని వివరించారు. అలాంటి ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయబోమని జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయా రని ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా పాలక పక్షం కళ్లు తెరిచి అటు విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా ఇటు రాయలసీమకు తలమానికమైన కడప ఉక్కు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. పోరాటాల రూపంలోనే వీటిని సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందరూ ఉక్కు పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సి.సుబ్రహ్మణ్యం, ఎన్.విజయ లక్ష్మి, టి.మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోగస్ ఓట్లు తొలగించాలి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** పశ్చిమ, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గంలో నమోదైన బోగస్ ఓట్లను తొలగించి బాధ్యులపై ఎన్నికల సంఘం అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎఫ్, స్వతంత్ర ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో ముఖ్య ఎన్నికల అధికారి(సీఈవో) ముఖేష్ కుమార్ మీనాను పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, షేక్ సాబ్జి, ఎస్టీయూ, యూటీఎఫ్ నేతలు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, కేఎస్ఎస్ ప్రసాద్ కలసి బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తూర్పు రాయలసీమలో 856 బోగస్ ఓట్ల వివరాలు ఆధారాలతో ఇచ్చామన్నారు. నెల్లూరు జిల్లా విద్యాశాఖాధి కారిని అన్యాయంగా బదిలీ చేసిన విషయం వారి దృష్టికి తీసుకొచ్చామని, వైఎస్ఆర్ జిల్లాలో ఎన్నడూ లేనంతగా తొలి దశలో 3570, కర్నూలులో 1600 ప్రైవేటు ఓట్లు నమోదయ్యాయని వివరించారు. ఖాళీ ధ్రువీకరణ పత్రాలపై జిల్లా విద్యాశాఖాధికారి సంతకాలు పెట్టారని, ప్రతి ఓటును పరిశీలించి అనర్హులను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కడప సాయిబాబా ప్రైవేటు ఉన్నత పాఠశాలలో 13 మంది టీచర్లు పనిచేస్తున్నట్లు యూడెస్క్‌లో నమోదు చేశారనీ, అదే పాఠశాల పేరుతో 78 మంది ఓటర్లుగా నమోదు చేశారని సీఈవో దృష్టికి తెచ్చారు. వాటిపై దర్యాప్తు చేపట్టి బోగస్ ఓట్లను తొలగించాలన్నారు. ఉపాధ్యాయులు కాని వారు ప్రైమరీ, యూపీలలో పనిచేస్తున్న వివిధ ప్రైవేటు వారిని సైతం ఓటర్లుగా నమోదైన వివరాలను ఆధారాలతో సహా సమర్పించారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిజాయతీగా పనిచేసిన అనంతపురం డీఈవోను కక్షతో బదిలీ చేశారని, అందువల్లే మిగిలిన జిల్లాల్లో బోగస్ ఓట్లు పెరిగాయని, ప్రతి ఓటును పరిశీలించి బోగస్ ఓట్లను తొలగించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన సీఈఓ అన్ని అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మ ణ్యం, కత్తి నరసింహారెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, షేక్ సాబ్జి తెలిపారు.

## జగనన్న కాలనీవాసులకు

# న్యాయం జరిగేవరకు పోరు

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల

**విశాలాంధ్ర-పొన్నూరు:** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల లబ్ధిదారులకు సత్వరమే న్యాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరు జిల్లా పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల లబ్ధిదారులతో కలిసి ధర్నా కార్యక్ర మంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సొంతింటి కల నెరవేరు తుందని ఆశించిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపిం దని విమర్శించారు. గత ఏడాది మార్చిలో సీపీఐ ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్లు లబ్ధిదారు లకు న్యాయం చేయాలని తలపెట్టిన కార్యక్రమాన్ని ప్రభుత్వం అణచివేసిందని ఆయన గుర్తుచేశారు. జగనన్న కాలనీ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తామని ప్రకటించటం హాస్యాస్పదమని ఇల్లు నిర్మించాలంటే కనీసం రూ.5 లక్షల ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని ధర్నాలో డిమాండ్ చేశారు. పాదయాత్రలో పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారని, కానీ ఇళ్లు నిర్మాణం చేయలేక ఉన్న స్థలాలను స్థానిక అధికారులు స్వాధీనపరచుకుంటామని బెదిరించటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్లను ప్రభుత్వం లబ్ధిదారులకు త్వరగా పంపిణీ చేయాలని అలాగే జగనన్న కాలనీలో రోడ్లు, తాగునీరు, మురుగు కాలవలు, విద్యుత్ తదితర మౌలిక వసతులు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగే వరకూ సీపీఐ పోరాటం చేస్తూనే ఉంటుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ జగన్నన కాలనీలో ఇళ్ల నిర్మాణం... లబ్ధిదారులకు జగనన్న గుర్రపునాడా ఇచ్చి గుర్రాన్ని కొనుక్కోండి అని చెప్పిన విధంగా ఉందని ఎద్దేవా చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ధర్నాలో జి.ఏడుకొండలు, మహిళా సంఘం నేతలు రావూరి సుగుణ, వి.సునీత, కుమారి, సుబ్బులు, గౌషియ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని

# ఘనంగా నిర్వహించాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డేగ ప్రభాకర్

**విశాలాంధ్ర-కాకినాడ:** ఈ నెల 26న జరిగే సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గాంధీభవన్‌లో సీపీఐ కాకినాడ జిల్లా సమితి సమావేశం టీ అన్నవరం అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే స్థలాల్లో పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహించినట్టు గుర్తుచేశారు. స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక తోడ్పాటును అందిస్తామని చెప్పిన జగన్ మాటలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చే రూ.180 సరిపోక జగనన్న కాలనీలన్నీ నిర్మాణానికి నోచుకోకపోవడంతో లబ్ధిదారులు అల్లాడుతున్నారన్నారు. ఇల్లు నిర్మించుకోకపోతే తిరిగి స్థలాలను స్వాధీన పరుచుకుంటామని లబ్ధిదారులను ప్రభుత్వ అధికారులు బెదిరిస్తున్నారన్నారు. వారికి సీపీఐ వెన్నుదన్నుగా నిలిచి పోరాటానికి సిద్ధమైందని తెలిపారు. డిసెంబర్ 31 నాటికి లబ్ధిదారులకు రూ.5లక్షలు చెల్లించాలని, లేదా ఇళ్లయినా నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జనవరిలో సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా అధికారులను, మంత్రులను ఘోరావ్ చేసి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కె బోడకుండా, సహాయ కార్యదర్శులు తోకల ప్రసాద్, లోవరత్నం, సత్యనారాయణ, పీస్ నారాయణ, శివకోటి రాజు బొబ్బిలి శ్రీను, శ్రీను సుబ్బలక్ష్మి, పప్పు, ఆదినారాయణ తదితరులు ప్రసంగించారు.

## 12, 13 తేదీల్లో ధర్నాను జయప్రదం చేయండి

**విశాలాంధ్ర-గుంతకల్లు:** రాష్ట్రంలో టిడ్కో ఇళ్లను పూర్తిచేయడంలో, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైం దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.జగదీష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ అధ్వర్యంలో అనంతపురం జిల్లా గుంతకల్లులోని బీటీ పకీరప్ప కాలనీలో టిడ్కో ఇళ్లు, జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం ఎంపీడీవో,మున్సిపాలిటీ కార్యాలయాల వద్ద ఈనెల 12 ,13 తేదీల్లో నిర్వహించే నిరసనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు జగదీష్, సీపీఐ నియోజవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, రైతు సంఘం అధ్యక్షుడు బి.గోవిందు తదితరులు అర్హులైన లబ్ధిదారుల ఇంటి ఇంటికి వెళ్లి నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ... జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే రూ.1.80లక్షలు ఏ మూలకు సరిపోవని, ఎంతలేదన్నా రూ.5 లక్షలు ఖర్చవుతుందన్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం వెంటనే సాయం పెంచాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను వెంటనే నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్ర, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మురళీ కృష్ణ, నాయకులు మక్బుల్ బాషా, మల్లయ్య,గడ్డం వెంకటేష్, మాబు, వలి, నందు, ఏఐఎస్ఎఫ్ నాయకులు వేణుగోపాల్, వెంకట్ నాయక్,వినోద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 35మంది మిలీషియా సభ్యుల లొంగుబాటు

**విశాలాంధ్ర-పాడేరు:** ఏవోబీ సరిహద్దులో మావోయిస్టుల ప్రభావం తగ్గిందని అల్లూరి జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ అన్నారు. అల్లూరి జిల్లా ఎస్పీ కార్యాలయం ఎస్పీ ఎదుట 35మంది మిలీషియా సభ్యులు, మావోయిస్టు సభ్యురాలు భారతి లొంగి పోయారు. భారతి నుంచి పేలుడు సామాగ్రిని స్వాధీనం చేసుకు న్నారు. ఆమెపై రూ.లక్ష రివార్డు ఉందని ఎస్పీ తెలిపారు. లొంగి పోయిన వారిపై కేసులు కూడా ఉన్నాయన్నారు. స్వచ్ఛందంగా లొంగిపోయిన మిలీషియా సభ్యులకు ప్రభుత్వ రాయితీని కల్పిస్తా మని హామీ ఇచ్చారు. మావోయిస్టులు, మిలీషియా సభ్యులు జన జీవన స్రవంతిలోకి వచ్చి స్వేచ్ఛగా జీవించాలన్నారు. లొంగిపోయే వారికి పునరావాసం కల్పిస్తామన్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ తుహిన్ సిన్హా, సీఆర్పీఎఫ్ 198, సెకండ్ కమాండెంట్ రాజేశ్ తివారీ, ఎస్పీఎక్స్ డీఎస్పీ వెంకట్రావు, పాడేరు సీఐ సుధాకర్ ఉన్నారు.

## న్యాయస్థానాల్లో

# తెలుగు అమలుకు కృషి

### అధికార భాషా సంఘం నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో విజయబాబు



**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** రానున్న రోజుల్లో న్యాయస్థానాల్లో తెలుగు వినియోగంతో పాటు, భాషాభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు అన్నారు. ఇందుకోసం తెలుగు భాషపై అభిమానం ఉన్న ప్రతి ఒక్కరి సహకారం తీసుకుంటానన్నారు. మంగళగిరి డీజీపీ కార్యాలయం పక్కనున్న ప్రైమ్‌హిల్ క్రెస్ట్ భవన సముదాయంలోని రెండవ అంతస్తు 201లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం నూతన కార్యాలయాన్ని శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పి. విజయ బాబు, రాష్ట్ర తెలుగు అకాడమీ అధ్యక్షులు ఎన్. లక్ష్మీ పార్వతితో కలసి ప్రారంభించారు. విజయ బాబు మాట్లాడుతూ అధికార భాషా సంఘం కార్యాలయం ఇప్పటివరకు సచివాలయంలో ఉందని, రచయితలు, సాహిత్యవేత్తలకు అందుబాటులోకి తేవాలని ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. తెలుగు భాషను ప్రపంచ వ్యాప్తంగా పరిపక్వం చేసే విషయంలో రచయితలు సూచనలు, విమర్శలు, సద్విమర్శలు చేయవచ్చన్నారు. తెలుగు భాష అభివృద్ధికి తనకున్న జర్నలిజం అనుభవం, మంచి రచయితలతో పరిచయాలు వినియోగిస్తానన్నారు. అధికార భాషా కార్యక్రమాలంటే కవి సమ్మేళనాలు, ఉగాది పంచాంగాలు కాదన్నారు. తెలుగు భాషకు చేయాల్సింది చాలా ఉందని, ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన తరువాత పత్రికా భాష చాలా ఇబ్బందికరంగా తయారైందని, పత్రికా భాషలో సంస్కరణలు తెచ్చేందుకు కృషి చేస్తానని, సీనియర్ పాత్రికేయులతో తరగతులు నిర్వహిస్తామన్నారు. కొన్ని రాష్ట్రాల్లో న్యాయస్థానాల్లో వాదోపవాదాలు స్థానిక భాషల్లోనే జరుగుతున్నాయన్నారు. తెలుగు అధికార భాష సంఘానికి వెబ్‌సైట్ లేదని, అంతర్జాలం ద్వారా ప్రపంచస్థాయిలో అమలనకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు, కార్యదర్శి బాలగంగాధర్ తిలక్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లిఖార్జున రావు, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతి రావు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## రైలు-ప్లాట్‌ఫాం మధ్య ఇరుక్కున్న యువతి

**విశాలాంధ్ర-కూర్మన్నపాలెం:** గుంటూరు రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి దిగుతుండగా ఎం.శశికళ రైలుకు ప్లాట్‌ఫామ్‌కు మధ్యలో ఇరుక్కుపోయింది. రైలు అగివున్నప్పటికీ బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరకు ఇంజినీరింగ్ సిబ్బంది అక్కడకు చేరుకుని ప్లాట్‌ఫామ్ తవ్వి బయటకు తీశారు. ఈ క్రమంలో గంటన్నరసేపు ఇరుక్కుపోయిన అమ్మాయి నరకయాతన అనుభవించింది. ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఆపరేటింగ్ అధికారులు అమ్మాయిని బయటకు తీయడంలో కీలకపాత్ర పోషించారు. అనంతరం ఆ అమ్మాయిని హుటాహుటిన 108లో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మెరపల శశికళ అన్నవరం దగ్గర గోపాలపట్నం గ్రామం, దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతుందని తోటి విద్యార్థులు తెలిపారు. విద్యార్థినికి రైలు ప్రమాదం జరిగిందని తెలుసుకున్న కళాశాల హెచ్‌ఓడీ మధుసూదనరావుతో పాటు సిబ్బంది స్టేషన్‌కు చేరుకుని, అక్కడ నుంచి అంబులెన్స్‌తోపాటు ఆసుపత్రికి వెళ్లారు. దీంతో రైలు గంట ఆలస్యంగా బయలుదేరింది.

సంపాదకీయం

# దిల్లీ కార్పొరేషన్‌లో కేజ్రీవాల్ హవా

ప్రధానమంత్రి మోదీ భాషలో చెప్పాలంటే దిల్లీలో కూడా డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో విజయం సాధించింది. పదిహేనేళ్ల బీజేపీ ఆధిపత్యానికి తెరపడింది. దిల్లీలోని మూడు పౌర పాలనా వ్యవస్థలను దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌గా మార్చిన తరవాత మొదటిసారి జరిగిన ఎన్నికలలో కేజ్రీవాల్ పార్టీ విజయ బావుటా ఎగురవేసింది. మొత్తం 250 స్థానాలలో ఆమ్ ఆద్మీ పార్టీకి 134 సీట్లు దక్కితే పదిహేనేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీకి 104 స్థానాలు దక్కాయి. కాంగ్రెస్ తొమ్మిది సీట్లకే పరిమితమైంది. 2015నుంచి దిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీకి ఇది గణనీయమైన విజయమే. దిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకురాలు షీలాదీక్షిత్ బీజేపీని మునిసిపల్ కార్పొరేషన్ నుంచి గద్దె దించడానికి చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు కానీ ఆ పని కేజ్రీవాల్ చేయగలిగారు. అలాగే దిల్లీలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా అధికారం చెలాయించిన షీలాదీక్షిత్‌ను ఓడించడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు కాని కేజ్రీవాల్ ఆ పని చేయగలిగారు. 2015లో, ఆ తరవాత 2020లో దిల్లీ శాసనసభ ఎన్నికలలో విజయం సాధించించి రికార్డు నెలకొల్పారు. కానీ 2019 లోకసభ ఎన్నికలలో దిల్లీలోని మొత్తం ఏడుస్థానాలను బీజేపీ కైవశం చేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ లాంటివనీ, శాసనసభ ఎన్నికలు సెమీఫైనల్ లాంటివనీ, లోకసభ ఎన్నికలు ఫైనల్ ఎన్నికలని అంటూ ఉంటారు. కానీ దిల్లీలో చాలా కాలం నుంచి ఈ మాట చెల్లుబాటు కావడంలేదు. లోకసభ, మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో బీజేపీ గెలుస్తూ వచ్చింది. ఇప్పుడు మొదటి సారి కార్పొరేషన్ ఎన్నికలలో పరాజయం పాలైంది. దిల్లీ ప్రజలు మునిసిపల్, శాసనసభ, లోకసభ ఎన్నికలలో భిన్నమైన తీర్పులుచెప్పడం ఆనవాయితీ అయినప్పటికీ కార్పొరేషన్ ఎన్నికల లోనూ ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించారు. 2017లోనూ అప్పుడు దిల్లీలో ఉన్న మూడు స్థానిక సంస్థలను బీజేపీ కైవశం చేసుకోగలిగినా ఇప్పుడు నిరాశే ఎదురైంది. నిజానికి మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఏప్రిల్-మే నెలల్లో జరగాల్సి ఉన్నా మూడు స్థానికసంస్థలను ఏకంచేయాలని భావించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలను వాయిదావేసింది. గుజరాత్ శాసనసభ ఎన్నికలతో పాటే దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించారు. కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్‌లోనూ అధికారంకోసం పోటీ పడుతున్నందువల్ల ఆయన గుజరాత్‌లో ఎన్నికల ప్రచారానికి ఎక్కువ సమయం కేటాయించకుండా చేయడానికి గత అయిదవ తేదీన కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించారు. మూడు స్థానికసంస్థలను ఏకం చేసి అన్నింటినీ దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌లో భాగం చేయాలన్న బీజేపీ ఆకాంక్ష అయితే నెరవేరింది కానీ అది బీజేపీకే ప్రతికూలంగా పరిణమించింది. ఆమ్‌ఆద్మీ పార్టీ అవినీతి వంకిలంలో మునిగిపోయిందని రుజువు చేయడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలూ ఫలించలేదు. దిల్లీ మంత్రి సత్యేంద్రజైన్ అవినీతి పరుడని, ఆయన తీహార్ జైలులో ఉన్నాడని చేసిన ప్రచారమూ బీజేపీకి ఓట్లు రాల్చలేదు. జైన్ నివాసం ఉండే షకూర్ బస్తీలోని మూడు మునిసిపల్ కౌన్సిలర్ స్థానాలు మాత్రం బీజేపీకి దక్కాయి. మిగతా చోట్ల బీజేపీ బాగా నష్టపోయింది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రభావం కార్పొరేషన్ ఎన్నికలలో అంతగా పనిచేయలేదు. పైగా ఆమ్‌ఆద్మీ పార్టీ మీద అవినీతిఆరోపణలు గుప్పించడం వికటించినట్టుంది. బీజేపీ అధికారంలో ఉన్న మునిసిపల్ కార్పొరేషన్‌లోని ఘాజీపూర్, జహంగీర్‌పురిలో చెత్త కుప్పలు పేరుకు పోయాయని ఆమ్‌ఆద్మీ పార్టీ చేసిన వాదన ఓటర్ల చెవి కెక్కినట్టు ఉంది. దిల్లీ ప్రభుత్వం ఎటూ కేజ్రీవాల్ చేతిలోనే ఉంది. మునిసిపల్ కార్పొరేషన్ కూడా దక్కింది కనక బీజేపీ ఏలుబడిలో జరిగా యంటున్న అవకతవకలను, క్రియారాహిత్యాన్ని తొలగించవలసిన బాధ్యత ఆమ్ ఆద్మీ పార్టీ మీదే ఉంటుంది. కేజ్రీవాల్ మెరుగైన విద్య అందిస్తున్నామని ఎప్పుడూ ప్రచారం చేస్తుంటారు కనక మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల పనితీరును మెరుగుచేసి చూపించవలసి ఉంటుంది. కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు 60 అడుగుల కన్నా వెడల్పు లేవు. మురికి వాడలను తొలగించి అక్కడ నివసిస్తున్న వారికి ప్రత్యామ్నాయ వసతిచూపడం ఆమ్ ఆద్మీ పార్టీకి పెద్ద పనే.

దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసి నందువల్ల కేజ్రీవాల్ ప్రతిష్ఠ పెరిగిన మాట వాస్తవమే. కార్పొరేషన్‌పై ఆధిపత్యం నిలబెట్టుకోవడంకోసం బీజేపీ విపరీతంగా ప్రయత్నించింది. ఏడుగురు బీజేపీ ముఖ్యమంత్రులు, 17 మంది కేంద్రమంత్రులు కార్పొరేషన్ ఎన్నికలలో పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఈ ప్రచార ఆర్భాటం ఏదీ బీజేపీని పరాజయం నుంచి కాపాడలేదు. దిల్లీ ముఖ్యమంత్రికి అడు గడుగునా ఆటంకాలు కలిగించడానికి మోదీ సర్కారు చేయని పనేలేదు. దిల్లీని ఒక రాష్ట్రంగా కూడా గుర్తించకుండా దిల్లీప్రభుత్వం అంటే లెఫ్టినెట్ గవర్నర్ పాలనే అని రాష్ట్రానికి ఉన్న నిర్వచనాన్ని కూడా మార్చేసింది. దిల్లీ ముఖ్యమంత్రి, ఆయన ప్రభుత్వం ప్రతి చిన్న విషయానికి లెఫ్టినెంట్ గవర్నర్ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడక తప్పని పరిస్థితి మోదీ ప్రభుత్వం కల్పించింది. లెఫ్టినెట్ గవర్నర్ కేంద్ర ప్రభుత్వానికే అనుకూలంగా వ్యవహరించడం చూస్తూనే ఉన్నాం. పరిపాలనలో దిల్లీ ముఖ్యమంత్రి అధికారాలను కుదించేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులను ఇరుకున పెట్టడానికి వేట కుక్కల్లాంటి కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్(ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఆదాయపు పన్ను శాఖలను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై కత్తికట్టినట్టు ప్రయోగించారు. అనేక మంది ఆమ్ ఆద్మీ నేతలు ప్రస్తుతం కటకటాలు లెక్కిస్తున్నారు. 167 మంది ఆమ్ ఆద్మీ పార్టీ నేతలమీద ఆరోపణలు మోపారు. కేంద్ర దర్యాప్తు సంస్థలకు సంబంధించిన 800 మంది అధికారులను రంగంలోకి దింపారు. వీటిలో ఏ కేసు నిలబడలేదని కేజ్రీవాల్ అంటున్నారు. కానీ కేంద్రం తీసుకున్న చర్యలన్నీ కేజ్రీవాల్ పార్టీకి అనేక అడ్డంకులు తెచ్చిపెట్టాయి. కార్పొరేషన్ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించినప్పటికీ 104 సీట్లతో బీజేపీ బలమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందని కేజ్రీవాల్ గుర్తించాలి. నిజానికి ప్రతిపక్షం బలంగా ఉండడం ప్రజాస్వామ్యానికి బలం చేకూరుస్తుంది. ఏమైతేనేం కేజ్రీవాల్ విజయమంత్రాన్ని ఒంటబట్టించుకున్నారు. ప్రస్తుతానికి ఆయనే మోదీకి దీటైన నాయకుడిగా కనిపిస్తున్నారు.

# బొగ్గుగని కార్మికుల వేతన ఒప్పందానికి డిపిఇ అడ్డు

కోల్ ఇండియా లిమిటెడ్(సీఐఎల్)లో 2,48,550 మంది, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్.సి.సి.ఎల్)లో 41,362 మంది ఉద్యోగుల వేతన భత్యాలు నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్(ఎన్.సి.డబ్ల్యూ.ఎ) ప్రకారంగా చెల్లిస్తారు. అయిదు జాతీయసంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్.ఎం.ఎస్, బి.ఎం.ఎస్,(ఐఎన్‌టీయుసి అంతర్గత వివాదాల వలన పాల్గొనడంలేదు) బొగ్గు కంపెనీల ప్రతినిధులు కలిసి జాయింట్ బైపార్టీయేట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ(జేబీసీసీఐ)తో చర్చలు జరిపి ఒప్పందం చేసుకుంటారు. 2021 జూలైనుండి 11వ ఎన్.సి.డబ్ల్యూ.ఎ అమలులోకి రావాలి. ఇందుకు ఏడుసార్లు జరిగిన జెబీసీసీఐ చర్చలు ఫలప్రదం కాకపోవడంతో నవంబర్ 29న జరిగిన చర్చలలో సి.ఐ.ఎల్ ప్రతినిధులు మినిమమ్ గ్యారెంటీ బెనిఫిట్(ఎంజిబి)గా 10శాతం వేతన చెల్లింపు ప్రతిపాదనలు ముందుకు తెచ్చింది.

ప్రభుత్వసంస్థల పనితీరును అంచనా వేయడానికి ఆర్థిక మంత్రిత్వశాఖ 1965లో బ్యూరో ఆఫ్ పబ్లిక్‌ఎంటర్ ప్రైజెస్(బిపిఇ)ని ఏర్పాటు చేసింది. ఇది పబ్లిక్‌సెక్టార్ ఎంటర్ ప్రైజెస్(సి.పి.ఎస్.ఇ)లకు నోడల్ శాఖగా వ్యవహరిస్తోంది. సి.పి.ఎస్.ఇ పనితీరును, మెరుగుదలను,మూల్యాంకనం, స్వయంప్రతిపత్తిని, సిబ్బంది నిర్వాహణ అలాగే వివిధ అంశాలపై సర్వే రూపకంగా సమాచారాన్ని సేకరించి మార్గదర్శకాలను రూపొందిస్తోంది. ప్రభుత్వ బొగ్గు పరిశ్రమలైన కోల్ ఇండియా, సింగరేణి కంపెనీలకు బడ్జెట్ సపోర్ట్‌ను 2014 నుండి కేటాయించడంలేదు. కనీసం బొగ్గుబ్లాక్‌ల కేటా యింపులో కూడా ప్రాముఖ్యం ఇవ్వడంలేదు. పన్నుల చెల్లింపులో రాయితీలు ఇవ్వడం లేదు. అయినా ఏటేటా బొగ్గు ఉత్పత్తులను పెంచుతూ దేశాభివృద్ధికి తోడ్పడుతున్నాయి. వార్షిక నివేదికలో వెల్లడించిన వివరాల ప్రకారంగా సి.ఐ.ఎల్ గడచిన 2021-2022లో 622.23మిలియన్‌టన్నుల బొగ్గుఉత్పత్తి చేసింది. రూ.17,378.42 కోట్ల నికర లాభాలను సాధించింది. కేంద్ర ప్రభుత్వానికి ఆదాయపన్ను, సెంట్రల్ ఎక్సైజ్, క్లీన్‌ఎనర్జీ సెస్, సెంట్రల్ సేల్స్‌టాక్స్, సర్వీస్ టాక్స్ యితర పన్నుల పేర 2020-2021 లో రూ.34, 396.39 కోట్లు, 2021-2022లో రూ.37,056.69 కోట్లు చెల్లించింది. సి.ఐ.ఎల్ బొగ్గు గనులు ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలకు రాయల్టీ, ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్, సేల్స్‌టాక్స్ వ్యాట్, ఎంట్రీ టాక్స్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, మోడిఫైడ్ ఏరియా డెవలప్మెంట్ అప్రోచ్(ఎంఎడిఎ) యితర పన్నుల పేర 2020-2021 లో రూ.55,917.03 కోట్లు, 2021-2022లో రూ.57,497. 87 కోట్లు చెల్లించింది.

సింగరేణి కంపెనీ 2021-2022లో 65.23 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. రూ.1,227.04 కోట్లు లాభాలను సాధించింది. బొగ్గు గని కార్మికులు తల్లి కడుపులాంటి బొగ్గు బావుల్లో చచ్చి బతికినట్లుగా ప్రమాదాలతో సహవాసం చేయాలి. పనిస్థలాలలో 19.5శాతం ఆక్సిజన్, 0.5శాతం కార్బన్ డయాక్సైడ్, 33.5 సెంటీగ్రేడ్ వెట్‌బల్బ్ ఉష్ణోగ్రత, కార్బన్ మోనాక్సైడ్, మిథేన్ గ్యాస్, కోల్ బ్లాస్టింగ్ పొగ, బొగ్గు దుమ్ము, విరామంలేని వేడి ఉన్న వాతావరణ ప్రతికూల పరిస్థితులలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. కాని కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల ఉపసంహరణ, వాణిజ్య బొగ్గు గనులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, బొగ్గు గనులవేలం ప్రక్రియలతో కోల్‌ఇండియా, సింగరేణి భవిష్యత్తుకు ముప్పు తెస్తుంది. ఉద్యోగుల వేతన ఒప్పందానికి డి.పి.ఇ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్), కాగ్(కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా) మార్గదర్శకాల పేరుతో వేతన ఒప్పందంలో ఆటంకాలు కల్పిస్తుంది. ఇప్పటికే ఉన్న కంపెనీలకు, కొత్త కంపెనీలకు కార్పోరేటు పన్నును 30శాతం నుండి 22, 15శాతం వరకు తగ్గించి చేయూత నిస్తుంది. కార్పోరేటుపన్ను తగ్గింపు వలన ఏటా దాదాపు రూ.1.45 లక్షల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుంది. 2020 జూన్ 18న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కమర్షియల్ మైనింగ్ ప్రాతిపదికన 44 బొగ్గు బ్లాక్‌లకు వేలంపాటను ప్రారంభించాడు. వేలం పాటలో బొగ్గు బ్లాక్‌లను దక్కించుకున్న వారికి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.50,000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించాడు. ఆరవ విడత 141 బొగ్గుబ్లాక్‌ల వేలంపాటలో బొగ్గు బ్లాక్‌లు దక్కించుకున్న వారికి కోల్ గ్యాసిఫికేషన్ కై రూ.6,000 కోట్లు కేటాయిస్తామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

వేతన ఒప్పందం కాలపరిమితి అయిదు సంవత్సరాలు 2021 జూన్ నాటికి ముగిసింది. జూలై నుండి 11వ ఎన్.సి.డబ్ల్యూ.ఎ అమలులోకి వస్తుంది. కనీసవేతనం చెల్లింపు ప్రకారంగా మూలవేతనం రూ.26,289.12పై స్థిర కరువుభత్యం(ఎస్.డి.ఎ) 1.795శాతం, రూ.471.09పై మారేడు కరువు భత్యం(విడిఎ) 27.8శాతంగా రూ.7,309.38, అటెండెంట్ బోనస్ 10శాతం రూ.2,629.12పై మొత్తం రూ.36,699.52పై యూనియన్లు 50శాతం మినిమమ్ గ్యారంటీ బెనిఫిట్(ఎంజిబి)గా డిమాండ్ చేశాయి. ఏడు దఫాలుగా జరిగిన చర్చల అనంతరం 30శాతం ఎం.జి.బి ఇచ్చినా సమ్మతమే అన్నారు. యాజమాన్య ప్రతినిధులు కేవలం 10శాతం మాత్రమే మినిమమ్ గ్యారంటీ బెనిఫిట్‌గా చెల్లిస్తామని మొండికేసారు. దానితో యూనియన్లు ఐక్యకార్యాచరణ ఉద్యమానికి సన్నద్ధమయ్యారు. డిసెంబర్ 9న దేశవ్యాప్తంగా బొగ్గుగనులపై బ్లాక్‌బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు చేయనున్నారు. అప్పటికి కూడా ప్రభుత్వం స్పందించకుంటే దేశవ్యాప్తంగా సమ్మె చేయడానికి కూడా సిద్ధం అవుతామని తెలిపారు. కాబట్టి కోల్‌బెల్ట్ రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు కూడా స్పందించి ప్రభుత్వంతో చర్చించి బొగ్గుగని కార్మికుల నేషనల్ కోల్‌వేజ్ అగ్రిమెంట్-11 ఒప్పందానికి తోడ్పడాలని కోరు కుంటున్నారు.

మేరుగు రాజయ్య, సెల్. 9441440791

# వణికిస్తున్న సైబర్ దాడులు

డాక్టర్.ఎం.సురేష్‌బాబు

మొన్న ఎయిమ్స్, నిన్న సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి...గత వారం రెండు ప్రభుత్వ రంగ సంస్థలపై ఇలా సైబర్ దాడులకు సంబంధించిన వార్తలు నిత్యం వింటూనే ఉన్నాం. వార్తలలోకి రానివి కోకొల్లలు. ప్రస్తుతం మనం సైబర్ కాలంలో జీవిస్తున్నాం. మన కార్యకలాపాలు అన్నిటిలోను డిజిటల్ సాంకేతికతలు వినియోగిస్తున్నాము. ప్రత్యేకించి కోవిడ్ నేపథ్యంలో, ప్రతి ఒక్క రంగం డిజిటల్ మాధ్యమంపై ఆధారపడింది. సైబర్ సెక్యూరిటీ కీలకమైంది. సైబర్ క్రిమినల్స్, మోసగాళ్లు, హ్యాకర్స్ బారి నుంచి డేటాను, నెట్వర్కు, సిస్టమ్స్‌ను, వ్యక్తిగత గోప్యతను కాపాడు కోవాలంటే అందుకు సైబర్ సెక్యూరిటీ ఎంతో అవసరమైంది. డిజటల్ యూజర్‌లు సైబర్ దాడులు ఎన్ని విధాలుగా జరుగుతూ ఉంటాయనేది తెలుసుకోవడం ముఖ్యం. అలాగే వాటిని కాపాడుకోవడానికి భద్రమైన ఆన్‌లైన్ అభ్యాసాలను తెలుసుకోవాలి. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ సిఫారసు మేరకు దేశంలో సైబర్ సంబంధిత దృఢత్వాన్ని కూడా పెంచుకోవలసి ఉంది. సైబర్ సెక్యూరిటీ విషయంలో అప్రమత్తం చేయాలనే ఆలోచన మన ప్రభుత్వాలకు లేదనిపిస్తుంది. భద్రత డొల్లతనం, అధికారుల నిర్లిప్తత సామాన్య ప్రజలకు కంటకంగా మారింది. నగదులేకుండా డబ్బులు చెల్లించుకునే ప్రక్రియమీద అవగాహనకోసం కేంద్రప్రభుత్వం భారీగా కసరత్తు చేస్తోంది అని ప్రచారం జరుగుతోంది. కానీ ప్రజలకు సైబర్ సెక్యూరిటీపై అవగాహనలేక భారీగా నష్ట పోతున్నారు. భద్రత కోసం తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే బ్యాంకర్లకీ, బ్యాంకులకీ తగిన హెచ్చరికలు జారీ చేయాలి. బ్యాంకుల వెబ్‌సైట్‌ల మీద సైబర్ దాడులు, డెబిట్ కార్డ్ మోసాలు, సర్వర్‌లలోకి అనధికార యాక్సెస్‌లూ జరుగుతూ ఉండడం సాధారణం అయింది. సైబర్ సెక్యూరిటీ పరంగా ఎలాంటి సంఘటన జరిగినా బ్యాంకులు ఆర్బీఐకి రెండు నుంచి ఆరుగంటల్లోగా సమాచారం అందించాలని ఆదేశాలు జారీ చేసినా వాటిని బుట్టదాఖలు చేసారు. సకాలానికి రిపోర్ట్ చేయకపోయినా, రుణమోసాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించినా బ్యాంకర్లపై క్రిమినల్ చర్యలు చేపట్టాలి. నా ఫేస్‌బుక్ హ్యాక్ అయింది, ఎవరో నా స్నేహితులను, బంధువులను, పరిచయస్తులను డబ్బు అడుగుతున్నారు, దయచేసి ఎవరూడబ్బు పంపొద్దు అన్న సమాచారం ఈ మధ్య కాలంలో ఎక్కువగా పాపులర్ అయ్యింది. మీ అకౌంట్లో డబ్బు జమ అయితే, మీకు జమ అయిన కొద్ది సేపటికి ఓటిపి వస్తుంది అది మీరు ఎవరూ లేని చోటికి లేదా ఏకాంత ప్రదేశంలో మాకు చేరవేస్తే మరింత డబ్బు పంపడం వీలుపడుతుంది అని ఒక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫోన్‌చేసి నిమిషాల్లో ఓటీపీ తెలుసుకొని మూడు లక్షల పైగా డబ్బు డ్రా చేసిన సంఘటన తాజాగా జరిగింది. ప్రతి రోజు లక్షా ఎనభైవేల ఫేస్‌బుక్ అకౌంట్లు హ్యాక్ అవుతున్న విషయం తెలిసిందే. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఎక్కువమంది మోసపోతున్నారు. వారిలో బాగా చదువుకున్న మేధావులు అధికంగా ఉంటున్నారు.

ఎప్పుడో మీరొక పాలసీ చేశారు మీరు ఆ పాలసీ ఆరు సంవత్సరాల క్రితం విత్‌డ్రా చేసుకున్నారు కానీ ఇంకా ఆ పాలసీ క్లోజ్ కాలేదు కొంత సొమ్ము అలాగే ఉండి పోయింది మీ ఖాతా వివరాలు ఆధార్ నంబర్, పాన్ నంబరు తదితర వివరాలు పంపండి అలాగే నామినేషన్ వివరాలు కూడా పంపండి అని పక్కా ప్రణాళికతో బురిడీ కొట్టించే మేధావులున్నారు. మీకు వంద గజాల స్థలం ఉందా మీరు ఈ నెంబరుకు పట్టా పేపర్లు, పాస్‌బుక్ పంపితే మేము ఇరవైలక్షలు ఇచ్చి అక్కడ సెల్ టవర్ ఏర్పాటు చేస్తాము అలాగే మీ ఖాతాలోకి ప్రతి నెల నలభైవేలు జమ చేస్తాము అని, ప్రాసెసింగ్ ఫీజు కేవలం పదివేలు కడితే చాలు, మీరు పది సంవత్సరాల పాటు నిశ్చింతగా ఉండొచ్చు అని. కరోనా రెండవవేవ్‌లో మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుటుంబానికి చనిపోయిన మరుసటి రోజు మేము మీ అబ్బాయి పనిచేసే కంపెనీ హెచ్‌ఆర్ మాట్లాడుతున్నాను మీ అబ్బాయి టర్మినల్ బెనిఫిట్స్ దాదాపు ఎనభై లక్షలుదాకా మా దగ్గర ఉన్నాయి. మీ కోడలు పాసుబుక్, పాన్, ఆధార్, చనిపోయిన వ్యక్తి ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇవ్వమని చెప్పి, మీ అబ్బాయి ఆరు లక్షలు కడితే కోటి రూపాయలు వస్తుందని నమ్మబలికి సర్వం ఊడ్చేశారు. కంప్యూటర్ ద్వారా మోసాలకు పాల్పడటం లేదా టెక్నాలజీని ఉపయోగించి కంప్యూటర్లపై దాడి చేయడం ఈ రెండూ చట్ట విరుద్ధమైన చర్యలే. సైబర్ క్రైమ్ అనేది కంప్యూటర్ ఆధారిత నేరం. కంప్యూటర్, కంప్యూటర్ నెట్‌వర్క్, నెట్‌వర్క్ డివైజ్‌లే లక్ష్యంగాచేసే దాడి లేదా నేరపూరిత చర్యను సైబర్ క్రైమ్ అంటారు. అక్రమంగా డబ్బు సంపాదించాలనుకునే సైబర్ నేరగాళ్లు, హ్యాకర్లు, ఇలాంటి నేరాలకు పాల్పడతారు. ఒక వ్యక్తి, సంస్థ లేదా దేశ రక్షణకు, ఫైనాన్షియల్ హెల్త్‌కు సైబర్ నేరాలు ఆటంకం కలిగిస్తాయి. ఇలాంటి చర్యలు చట్ట వ్యతిరేకమైనవి. భారత్‌తోపాటు ప్రపంచదేశాలు సైబర్ నేరాలకు కఠినమైన శిక్షలు విధిస్తున్నాయి. కంప్యూటర్ సిస్టమ్స్ లేదా నెట్‌వర్క్‌లను అక్రమంగా, అనధికారంగా యాక్సెస్‌చేయడం లేదా హ్యాకింగ్ చేయడం, ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న సమాచారాన్ని దొంగిలించడం, ఈ మెయిల్‌బాంబింగ్, సలామిఎటాక్, సర్వీస్‌ఎటాక్‌ను అడ్డుకోవడం, వైరస్ లేదా వార్మ్ దాడులు, లాజిక్ బాంబ్స్, ఇంటర్నెట్ టైమ్ థెఫ్ట్ వంటివన్నీ వివిధ రూపాల్లో ఉండే సైబర్ నేరాలు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే సైబర్ టెర్రరిజం, వ్యక్తులను లక్ష్యంగా చేసుకునే సైబర్ పోర్నోగ్రఫీ, సైబర్ స్టాకింగ్, సైబర్ డిఫమేషన్.. ఆస్తులను లక్ష్యంగా చేసుకునే ఆన్‌లైన్ గాంబ్లింగ్, మేధో సంపత్తి హక్కుల ఉల్లంఘన, ఫిషింగ్, క్రెడిట్ కార్డు మోసాలు వంటివి వివిధ రకాల సైబర్‌నేరాలు. స్పూఫింగ్ అంటే ఏంటి? కంప్యూటర్లను అనధికారంగా, మోసపూరితంగా యాక్సెస్ చేసేందుకు ఈ టెక్నాలజీని నేరగాళ్లు ఉపయోగిస్తారు. ఈ పద్ధతిలో చొరబాటు దారులు హోస్ట్ ఉన్న కంప్యూటర్‌కు కొన్ని రకాల మెసేజ్‌లను పంపుతారు. అది ట్రస్ట్ హోస్ట్ నుంచి వస్తున్నట్లు నమ్మిస్తారు. దీని ద్వారా సిస్టమ్‌ను తమ ఆధ్వర్యంలోకి తీసుకుంటారు. ఫిషింగ్ అంటే ఏమిటి? వినియోగదారుని పేరు, పాస్‌వర్డ్, క్రెడిట్ కార్డ్ వివరాలు వంటి సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడానికి చేసే నేరం, మోసపూరిత చర్యను ఫిషింగ్ అంటారు. విశ్వసనీయ సంస్థగా లేదా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌లోని వ్యక్తిగా మారువేషాలద్వారా ఈ మోసాలకు పాల్పడతారు.

భారతదేశంలో సైబర్ నేరాలను నియంత్రించే చట్టాలు ఏవి? సైబర్ క్రైమ్‌లో దొంగతనం, మోసం, ఫోర్జరీ, పరువునష్టం, అల్లర్లు వంటి నేర కార్యకలాపాలు ఉంటాయి. వీటన్నింటికీ ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం శిక్షలు విధిస్తారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, 2000 కింద అన్ని రకాల సైబర్ నేరాలకు శిక్షలు అమల్లో ఉన్నాయి. కాని సైబర్ నేరాలను నిరోధించే వ్యక్తులు, అలాగే సైబర్ చట్టం గురించి కనీస అవగాహన మన సంరక్షులకు లేక పోవడం విచారకరం. ఏ సెక్షన్ వర్తిసుందో స్టేషన్ హౌస్ ఆఫీసరుకు, జిల్లాస్థాయి అధికారులకు తెలియని పరిస్థితి. సైబర్‌చట్టం అమలుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పోలీసు, న్యాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఆర్థికరంగాల్లో పనిచేసే వ్యక్తులకు అవగాహన శిబిరాలు, పునశ్చరణ తరగతులు పెట్టాలి. ఇంటర్నెట్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలద్వారా వేధింపులకు గురిచేయడాన్ని సైబర్ స్టాకింగ్ అంటారు. ఆస్తులను లక్ష్యంగా చేసుకునే దాడులను ఆర్థిక నేరాలు అంటారు. ఆస్తిపై హక్కును, ఓనర్‌షిప్‌ను అక్రమంగా మార్చుకోవడం, చట్టవిరుద్ధంగా ఒకరి వ్యక్తిగత ప్రయోజనాలను దెబ్బతీయడం వంటివన్నీ ఈ జాబితాలో ఉంటాయి. సైబర్ దాడులకు గురైనవారు సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ సెల్‌కు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. సైబర్ నేరగాళ్ల ద్వారా నష్టపోయినవారు 155260 టోల్ ఫ్రీ నంబరుకు నేరం జరిగిన 48 గంటలలోపు తెలియపరిస్తే కొంత మేరకు నష్ట నివారణ చేయవచ్చు.

వ్యాస రచయిత ప్రజాసైన్స్ వేదిక, అధ్యక్షులు

# అక్రమ వలసలపై రాజకీయ క్రీడ

నంటూ బెనర్జీ

భారతదేశంలోకి వస్తున్న అక్రమ వలసదారుల సంఖ్యపై రాజకీయ పార్టీలు ప్రమాదకరమైన ఆటాడు తున్నాయి. భారత్ మరో రెండు నెలల్లో చైనాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా అవతరిస్తుందని ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక జనాభా విభాగం అంచనా వేసింది. అధికారికంగా,అమెరికా తర్వాత అక్రమ వలసదారులకు ప్రపంచంలో రెండవ గమ్యస్థానంగా భారతదేశం ఉంది. అమెరికాలో గణాంకాలు చాలా వరకు నమ్మవచ్చు.మన దేశంలోకి ఎంతమంది అక్రమ వలసదారుల వచ్చేది తెలియదు. ఊహించాల్సిందే. భారత పౌరసత్వ చట్టం 1955 అక్రమ వలసలను, నకిలీ పౌరసత్వాన్ని నియంత్రించడంలో విఫలమైంది. మునిసిపల్, రాష్ట్ర, జాతీయ ఎన్నికల సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం అక్రమ వలసదారులకు రేషన్ కార్డ్‌లు, ఎన్నికల గుర్తింపు కార్డ్‌లు, ఆధార్ కార్డ్‌లు, పాస్‌పోర్ట్‌లు వంటి పత్రాలను అందించడంలో రాజకీయ పార్టీలు, స్థానిక ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నారు. అక్రమ వలసదారుల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్న వాస్తవాన్ని వీరు విస్మరిస్తున్నారు. పౌరసత్వ చట్టం 1955లో ప్రకటించిన తర్వాత 2003లో, 2019లో రెండుసార్లు సవరించారు. 2003 సవరణ జాతీయ పౌర నమోదు పట్టికను (ఎన్‌ఆర్‌సి) తప్పనిసరి చేసింది. 2019 సవరణ ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల నుండి ముస్లిమేతర వలసదారులకు భారతీయ పౌరసత్వానికి వేగంగా కార్యక్రమం చేపట్టింది. వాస్తవానికి, 1955లో అసలు పౌరసత్వ చట్టం ప్రకటించకముందే ఎన్‌ఆర్‌సీ నిర్వహించినందున 2003 సవరణ అనవసరంగా పరిగణించాల్సింది. భారతదేశ మొదటి జనాభా గణన రికార్డుల ప్రకారం మొదటి ఎన్‌ఆర్‌సీ 1951 లోనే రూపొందించారు. పౌరసత్వ చట్టం రెండు సవరణలు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ నిర్వహించింది. అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో 2003 సవరణ చేపట్టగా, నరేంద్ర మోదీ తాజా సవరణ చేశారు. అయితే బీజేపీ ప్రభుత్వం వాటి అమలు విషయంలో ఎప్పుడూ సీరియస్‌గా లేదు. కేవలం ఎన్నికల ముందే ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. తాజా ఐరాస గణాంకాల ఆధారంగా మన దేశ జనాభా మొత్తం ప్రపంచ జనాభాలో 17.7శాతంతో 1.412 బిలియన్లకు పైగా నమోదైంది.

2030 నాటికి భారతదేశ జనాభా 1.515 బిలియన్లకు పెరగనుంది. చైనా జనాభా 2022లో 1.426 బిలియన్ల నుంచి 2030 నాటికి 1.416 బిలియన్లకు తగ్గనున్నట్లు అంచనా. మొత్తం భూభాగంలో ప్రపంచంలో మూడవ అతిపెద్ద దేశం, చైనా దాదాపు 9.6 మిలియన్ చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది, ఇది భారతదేశ భూభాగానికి దాదాపు మూడు రెట్లు ఎక్కువ. అక్రమ వలసల సమస్య గురించి ప్రభుత్వంగానీ, రాజకీయ పార్టీలు ఆందోళన చెందుతున్నట్లు కనిపించడం లేదు. అంతర్జాతీయ రికార్డుల ప్రకారం అక్రమ వలసదారులకు ప్రపంచంలో రెండవ అతిపెద్ద నివాసంగా

భారతదేశం నమోదైంది. గత దశాబ్దంలో కనీసం 1.4 మిలియన్ల బంగ్లాదేశీయులతో సహా భారతదేశంలో పది మిలియన్ల అక్రమ వలసదారులు ఉన్నారని అంచనా. జనవరి 2016 నాటికి దాదాపు 10.9 మిలియన్ల అక్రమ వలసదారులు అమెరికాలో ఉన్నారు. 2010 నివేదిక ప్రకారం, అమెరికాలో అక్రమ వలసదారులకు 5.5 మిలియన్ల మంది పిల్లలు జన్మించారు, వీరిలో 4.5 మిలియన్ల మంది పుట్టుకతో చట్టబద్ధ పౌరులయ్యారు. అమెరికాలోని మొత్తం నవజాత శిశువులలో ఎనిమిది శాతం మంది అక్రమ వలసదారులుగా కనీసం తల్లిదండ్రులలో ఎవరో ఒకరిని కలిగి ఉన్నారని అంచనా.

ఆసక్తికరంగా, ఐరోపా, ఆసియా నుండి వచ్చే అక్రమ వలసదారులకు రష్యా ప్రపంచంలో మూడవ గమ్యస్థానంగా ఉంది. రష్యాలో10 నుంచి12 మిలియన్ల అక్రమ వలసదారులు ఉన్నారని అంచనా. రష్యాలోకి వలసలు రావడానికి అత్యంత ప్రాచుర్యం పొందిన దేశాలలో చైనా ఒకటి. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుండి వలసదారుల ప్రవాహాన్ని ఎదుర్కోవటానికి తూర్పు సరిహద్దులో గోడలు నిర్మిస్తున్నారు. బంగ్లాదేశ్-భారత్ సరిహద్దు దాదాపు 4,100 కిలోమీటర్ల పొడవు ఉంది, ఇది ప్రపంచంలోని ఐదవ-పొడవైన భూ సరిహద్దు 2011నాటికి 200కిలోమీటర్ల మేర మాత్రమే అడ్డంకులు పూర్తయ్యాయి. బంగ్లాదేశ్ నుండి భారత్‌కు అక్రమ వలసలను నియంత్రించడం పెద్ద సవాలుగా ఉంది. ఈ సమస్యపై బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా, ప్రధాని నరేంద్ర మోదీ మధ్య అధికారిక స్థాయిలో ఈ సమస్య మాత్రం ప్రస్తావనకు రాలేదు. మానవ హక్కుల నిఘా సంస్థ ప్రకారం, సుమారు40,000మంది రోహింగ్యాలు భారతదేశంలో ఉన్నారని అంచనా - వారిలో కనీసం 20,000 మంది ఐరాస మానవ హక్కుల కమిషన్‌లో నమోదయ్యారు. అనధికారిక అంచనా ప్రకారం 1,00,000 కంటే ఎక్కువమంది ఉన్నారని అంచనా. వీరంతా బంగ్లాదేశ్ ద్వారా దేశంలోకి ప్రవేశించారు. కొంతమంది రోహింగ్యా వలసదారులు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఇటీవల కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ లోక్‌సభలో వెల్లడించింది. ఎన్‌ఆర్‌సి, సీఏఏ అమలును 11 మంది ముఖ్యమంత్రులు వ్యతిరేకిస్తున్నారు.. ఈ చర్యలు దేశ లౌకిక రాజ్యాంగంపై, మైనారిటీ ముస్లింలపై దాడిగా పేర్కొన్నారు. న్యాయంగా దేశ జనాభా ఎంత అనేది నిర్ధారించడంలో 1955 నాటి పౌరసత్వ చట్టం విఫలమైంది. పౌరసత్వాన్ని నిరూపించడంలో విఫలమైన వారిపై ఎన్‌ఆర్‌సిని ఉపయో గించవచ్చు. వాటిని నిర్బంధ కేంద్రాలకు తీసుకెళ్లవచ్చు లేదా బహిష్కరించవచ్చు. ఆగష్టు, 2019 లో ఎన్‌ఆర్‌సి చేపట్టిన ఏకైక రాష్ట్రం అసోం. ఈ నమోదులో రాష్ట్ర జనాభా 33 మిలియన్లుగా ఉన్నాయి, 31 మిలియన్ల మంది నమోదు చేసుకున్నారు. ఇది 1.9 మిలియన్ల దరఖాస్తు దారుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. అసోం అక్రమ వలసదారుల నమోదు కార్యక్రమంలో చట్టబద్ధమైన పౌరులను మినహాయించిందని బిజెపి అభిప్రాయం. గత మూడేళ్లలో వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఏదేమైనా, అక్రమవలసదారులపై ఓటుబ్యాంకు-రాజకీయాలు ఎంతవరకు ప్రభావంచూపిస్తాయో వేచి చూడవలసిందే.

# రోడ్డెక్కిన తమిళ రైతులు

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు - ధర్నాలు - దీక్షలు
- మెరుగైన ఎంఎస్పీ, చెరకు బకాయిల చెల్లింపులకు డిమాండ్
- బలవంతపు భూసేకరణలు-టిడ్కోకు వ్యతిరేకంగా ఏడాదికిపైగా పోరు

**కోయంబత్తూర్:** మా కష్టాలు తీరేదెప్పుడు? పాలకులకు మా గోడు పట్టదా? మా గొంతు వినిపించదా? సాగుభూములను పరిశ్రమల కోసం ధారాదత్తం చేస్తే ఊరుకోవాలా? అంటూ తమిళనాడు ప్రభుత్వంపై ఆ రాష్ట్ర రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. టిడ్కోకు వ్యతిరేకంగా ఏడాదికిపైగా పోరాడుతున్నారు. పారిశ్రామికవాడ కోసం సారవంతమైన భూముల సేకరణను వ్యతిరేకించారు. వరి, చెరకు ప్రొక్యూర్‌మెంట్ ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే చెరకు మిల్లులకు బకాయి చెల్లింపుల్లో జాప్యంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

తమిళనాడువ్యాప్తంగా అనేక రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. తమిళనాడు పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ (టిడ్కో) ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్‌కు వ్యతిరేకంగా కోయంబత్తూర్ జిల్లాలోని అన్నూర్, మెట్టుపలాయం బ్లాకుల్లో వేలాది మంది రైతులు ఏడాదికిపైగా ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయ భూములను పారిశ్రామిక వాడ కోసం సేకరించడాన్ని వ్యతిరేకించారు. 13 నెలలుగా ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఇది జీవన్మరణ సమస్య అని, జీవనోపాధిని కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడంతో వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారు. నవంబరు 28న నిరాహార దీక్ష చేపట్టారు. డిసెంబరు 3న కోయంబత్తూర్‌లోని పుల్లియంకులం-వినయగర్ ఆలయం నుంచి అన్నూర్‌లోని మన్నేశ్వర ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కుంభకోణం జిల్లా రైతులు వరి, చెరకుకు సముచిత కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం డిమాండ్ చేస్తూ చత్తీస్‌గఢ్ తరహా ఎంఎస్పీలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంచేశారు. చెరకు సరఫరాకు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం కొనసాగుతున్న క్రమంలో తంజావూరు జిల్లాలోని రైతుల్లో ఓ వర్గం నిరవధిక దీక్ష చేశారు.

ప్రైవేటు చెరకు మిల్లులకు పంటోత్పత్తి సరఫరా చేసినందుకు సకాలంలో చెల్లింపులు కల్లా అని రైతులు తెలిపారు. తంజావూరులో తిరువోరన్ మిల్లులకు చెరకు సరఫరా చేసిన రైతులు పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక దీక్ష కొనసాగిస్తున్నారు.
గతంలో సరఫరా చేసిన చెరకుకు చెల్లింపులు జరగని క్రమంలో మిల్లు తమకు రూ.100 కోట్ల వరకు బకాయి పడినట్లు రైతులు తెలిపారు. తమ పేర్లతో రూ.500 కోట్ల రుణాన్ని ఇదే మిల్లు బ్యాంకుల నుంచి తీసుకుందని కూడా వారు ఆరోపణలు చేశారు.

అయితే ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం వ్యవసాయ బడ్జెట్‌ను విడిగా ప్రవేశపెట్టిందిగానీ రైతుల మెప్పును పొందలేకపోయింది. వరికి ఎంఎస్పీలో స్వల్ప పెంపుదలతో రైతన్నను సంతృప్తిపర్చడంలో విఫలమైంది. రాష్ట్ర సలహా ధర (ఎస్ఏపీ) పునరుద్ధరణకు చెరకు రైతులు డిమాండ్ చేస్తుండగా దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. క్వింటా చెరకుకు రూ.4వేలు ఇవ్వాలన్న డిమాండ్ అపరిష్కృతంగానే ఉంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల వెతలను పట్టించుకోవడం లేదని, కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం వారి డిమాండ్‌ను పరిష్కరించడం లేదని, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని రెట్టింపు చేయాలని కేంద్రాన్ని రైతులు డిమాండ్ చేశారని తమిళనాడు కావేరి రైతుల సంరక్షణ సంఘం పేర్కొంది. వరి, చెరకు ప్రొక్యూర్‌మెంట్ ధర పెంచినందుకు చత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు కుంభకోణం నుంచి రైతులు ఆ రాష్ట్రానికి వెళ్లారు.

## తమిళనాడులో నెత్తురోడిన రోడ్డు ఆరుగురి దుర్మరణం

చెన్నై: చెన్నై సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. రెండు భారీ ట్రక్కుల మధ్య మినీ ట్రక్కు చిక్కుకుపోవడంతో ఆరుగురు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో ఐదుగురిని చెంగల్‌పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చెంగల్‌పట్టు జిల్లా పోలీసు సీనియర్ అధికారి వివరాల మేరకు ... పొజిచలూరుకు చెందిన 15 మందికి పైగా భక్తులు బుధవారం తెల్లవారుజామున మదురాంతకం సమీపంలోని ఆలయాన్ని సందర్శించి తిరిగి మినీ ట్రక్కులో బయలుదేరారు. జీఎస్టీ రోడ్డులో జానకీపురం వైపు వెళుతుండగా, మినీ ట్రక్కు ఒక్కసారిగా అదుపు తప్పి ఎదురుగా ఉన్న భారీ ట్రక్కును ఢీకొట్టింది. వాహనంలో ఉన్నవారు పూర్తిగా బయటకు రాకముందే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ, మినీ లారీని బలంగా ఢీకొట్టడంతో ట్రక్కు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మదురాంతకం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆరుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చెంగల్‌పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. మృతులు పొజిచలూరులోని జ్ఞానాంబిగై వీధికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కోవిడ్ మృతుల కుటుంబాలకు రూ.50వేల సాయం: కేంద్రం

**న్యూఢిల్లీ:** కోవిడ్-19 బారిన పడిన మరణించిన వారి బంధువులకు ప్రభుత్వం రూ.50 వేల పరిహారం అందజేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ రాజ్యసభలో తెలిపారు. విపత్తు నిర్వహణ చట్టం, 2005 ప్రకారం జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్డీఎంఏ) జారీ చేసిన మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఆదేశానుసారం కోవిడ్-19 బాధితుల కుటుంబాలకు పరిహారం ఇవ్వబడుతుందని రాతపూర్వక ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు.

రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుంచి సహాయకచర్యల్లో పాల్గొన్నవారు లేదా సన్నద్ధత కార్యకలాపాలలో పాల్గొన్న వారు సహా వైరస్ సోకి మరణించిన వ్యక్తి బంధువులకు సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ కారణంగా ఆదాయాలను కోల్పోయి పేద ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చడానికి, ఆహార భద్రతపై మహమ్మారి ప్రభావాలను తగ్గించడానికి ప్రభుత్వం మార్చి, 2020లో అదనపు ఉచిత ఆహార ధాన్యాల (బియ్యం/గోధుమ) పంపిణీని ప్రకటించిందని మంత్రి పేర్కొన్నారు. దాదాపు 80 కోట్ల మంది లబ్ధిదారులకు ు ప్రధాన్ మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద ప్రతి వ్యక్తికి నెలకు 5 కిలోల చొప్పున బియ్యం/గోధుమలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు.

## ప్లాస్టిక్ సంచిలో భార్య మృతదేహం!

**బెంగళూరు:** చేతిలో చిల్లిగవ్వలేని ఓ వ్యక్తి... తన భార్య మృతదేహాన్ని ప్లాస్టిక్ సంచిలో పెట్టి మోసుకెళ్లిన హృదయ విదారక ఘటన కర్ణాటకలోని యలందూరు పట్టణం లో జరిగింది. మండ్యా జిల్లాకు చెందిన రవి, అతడి భార్య కలమ్మ కొంతకాలంగా యలందూరులోని అటవీశాఖ కార్యాలయం సమీపంలోని చిన్న గుడిసెలో నివసిస్తున్నారు. వీళ్లద్దరూ ప్లాస్టిక్ వస్తువులను సేకరిస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి అనారోగ్యంతో కలమ్మ(26) మృతి చెందింది. ఆమెను కోల్పో యిన బాధలో ఉన్న భర్త రవికి అంత్యక్రియలకు డబ్బులు ఎలా సమకూర్చాలో తెలియలేదు. దుఃఖాన్ని దిగమింగుతూ మృతదేహాన్ని భుజాలపై వేసుకుని అంతిమ సంస్కారాల కోసం పట్టణంలోని సువర్ణవ తి నది ఒడ్డుకు తీసుకువెళ్లాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

## అప్పు తిరిగివ్వలేదని దారుణ హత్య

**భాగల్పూర్:** తీసుకున్న అప్పును తిరిగి చెల్లించలేదనే ఉక్రోషంతో ఓ మహిళ అవయవాలను నరికేసిన దారుణ ఘటన బీహార్‌లో చోటుచేసుకుంది. తీవ్ర గాయాల పాలైన ఆ మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పిర్‌పైంటి పోలీస్ స్టేషన్ పరిధిలో డిసెంబరు 3న ఈ దారుణం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నీలం దేవి అనే మహిళ తన కుమార్తె వివాహం కోసం కొంత సొమ్మును షకీల్ మియాన్ నుంచి అప్పుగా తీసుకున్నారు. ఆమె ఆ రుణాన్ని తిరిగి చెల్లించలేకపోయారు. దీంతో కోపోద్రిక్తుడైన షకీల్ తన సహచరుడు జుడిన్ మియాన్‌తో కలిసి నీలం దేవిపై దాడి చేశాడు. వీరిద్దరూ కలిసి ఆమె అవయవాలను నరికేశారు. అనంతరం ఆమె ప్రాణాలు కోల్పోయారు. జుడిన్‌ను అరెస్టు చేశామని, షకీల్‌ను కోర్టు జ్యుడిషియల్ కస్టడీకి ఆదేశించిందని భాగల్పూర్ ఎస్పీ చెప్పారు.

## కొన్ని వ్యాఖ్యలు నన్ను బాధించాయి: సచిన్ పైలట్

**న్యూఢిల్లీ:** రాజకీయాల్లో ఉన్నంత మాత్రాన తనకు ఫీలింగ్స్ ఉండవని భావించరాదని రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సచిన్ పైలట్ చెప్పారు. కొన్ని వ్యాఖ్యలు తనను బాధించాయని, అయితే మళ్లీ గతంలోకి తొంగిచూడాలని అనుకోవడంలేదని స్పష్టం చేశారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ ల మధ్య విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. గత నెలలో గెహ్లాట్ తనపై చేసిన వ్యాఖ్యలపై పైలట్ తాజాగా స్పందించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పైలట్ మాట్లాడారు. 'నేను రాజకీయ నాయకుడినే. కానీ నేను కూడా మనిషినే. నేను కూడా బాధపడతా, నేనూ అవమానం ఫీలవుతా' అని పైలట్ చెప్పారు. తనను విశ్వాసఘాతకుడు(గద్దర్) అంటూ గెహ్లాట్ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి పైలట్ ఈ విధంగా స్పందించారు. అయితే, గతాన్ని తవ్వుకుంటూ బాధపడే వ్యక్తిని కాదని ఆయన అన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చడమే ప్రస్తుతం తన ముందున్న లక్ష్యమని పైలట్ వివరించారు. రాష్ట్రంలో నాయకత్వ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనేది పార్టీ హైకమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కిందటి నెలలో పైలట్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓ విశ్వాసఘాతకుడు రాజస్థాన్ కు ఎప్పటికీ సీఎం కాలేడని గెహ్లాట్ అన్నారు. పార్టీ హైకమాండ్ కూడా పైలట్ ను ముఖ్యమంత్రి చేయదని స్పష్టం చేశారు. పార్టీని మోసం చేసిన, కనీసం పది మంది ఎమ్మెల్యేల మద్ధతు కూడా లేని వ్యక్తి ముఖ్యమంత్రి కావడం కల్ల అని గెహ్లాట్ పేర్కొన్నారు.

## దేశంలో 84,102 స్టార్టప్ కంపెనీలు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది నవంబరు 30 నాటికి దేశంలో 84,102 అంకుర సంస్థల్ని గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో బుధవారం ఓ సభ్యుడు అడిగి ప్రశ్నకు సమాధానం ఇస్తూ వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సోమ్ ప్రకాశ్ ఈ వివరాలను వెల్లడించారు. 'స్టార్టప్ ఇండియా' పథకం 2016లో ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా 'డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ)' అర్హతగల కంపెనీలను అంకుర సంస్థలుగా గుర్తిస్తుంది. వీటికి పన్ను మినహాయింపు వంటి ప్రత్యేక ప్రోత్సాహకాలను కల్పిస్తుంది. వ్యవసాయం, బయోటెక్నాలజీ, రసాయనాలు సహా మొత్తం 56 రంగాలకు అంకుర సంస్థలు విస్తరించాయని సోమ్ ప్రకాశ్ తెలిపారు. స్టార్టప్‌లకు వివిధ దశల్లో మూలధనాన్ని సమకూర్చేందుకు ప్రభుత్వం 'ఫండ్ ఆఫ్ ఫండ్స్', 'స్టార్టప్ ఇండియా సీడ్ క్యాపిటల్' వంటి పథకాల్ని తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు.

## మందీ, మార్బలంతో వచ్చినా...
# మేమే గెలిచాం: ఆప్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటిన ఆమ్‌ఆద్మీపార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించింది. ఈ నేపథ్యంలో బీజేపీపై తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరింది. అపరిమిత శక్తి, ముఖ్యమంత్రులు, దర్యాప్తు సంస్థల బలం, ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా చెప్పుకునే బీజేపీ ఓ చిన్న పార్టీ చేతిలో ఓడిపోయిందని విమర్శలు గుప్పించింది. 'పేద, నిజాయతీ కలిగిన, విద్యావంతమైన ఓ చిన్న పార్టీ.. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీని ఓడించింది. బీజేపీ, ఆమ్‌ఆద్మీ పార్టీ మధ్య జరిగిన హోరాహోరీ పోరు ఇది. ఏడుగురు ముఖ్యమంత్రులు, 17మంది కేంద్ర మంత్రులు, 100మంది ఎంపీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ, ఐటీలతోపాటు జైల్లో ఉన్న ఓ వ్యక్తి (సుకేశ్ చంద్రశేఖర్) కూడా ఎన్నికల్లో వారి ముఖ్య ప్రచారకర్తలు. అయినప్పటికీ సామాన్యుడి చేతిలో ఓడిపోయారు' అని ఆ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. అరవింద్ కేజ్రీవాల్ విజయాన్ని ఆపాలని బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అభివృద్ధి కోసం పనిచేసిన వారికే ఢిల్లీ పౌరులు ప్రభుత్వ పగ్గాలు అప్పజెప్పారన్నారు. కేజ్రీవాల్‌పై బీజేపీ చల్లుతున్న బురదను తుడిచేసిన ఢిల్లీవాసులు.. తాజాగా మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యతలను కూడా ఆయనకే కట్టబెట్టారని రాఘవ్ చద్దా స్పష్టం చేశారు. మరోవైపు, మున్సిపల్ కార్పొరేషన్‌లో 15 ఏళ్ల బీజేపీ పాలనకు అడ్డుకట్ట వేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ.. స్పష్టమైన మెజారిటీతో జయకేతనం ఎగురవేసింది. మొత్తం 250 వార్డుల్లో ఆప్ 134 స్థానాలకు కైవసం చేసుకుంది. దీంతో మేయర్ సీటు ఆమ్ ఆద్మీ వశమైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ 104 వార్డులను గెలుచుకోగా.. హస్తం పార్టీ కేవలం తొమ్మిది స్థానాలకు పరిమితమైంది. మరో మూడు చోట్ల ఇతరులు విజయం సాధించారు.

## ఎగ్జిట్ పోల్స్ తారుమారవుతాయి: మాన్

**న్యూఢిల్లీ:** గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో ఆశ్చర్యకర ఫలితాలు రాబోతున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ నేత, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ జోస్యం చెప్పారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) ఎన్నికల్లో తమ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. గుజరాత్ ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పుతాయని, అనూహ్య ఫలితాలు వస్తాయని వ్యాఖ్యానించారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరపున గెలిచిన వారంతా తమతోనే ఉంటారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీని వరుసగా 15 ఏళ్లుగా పాలించిన కాంగ్రెస్‌ను అరవింద్ కేజ్రీవాల్ పార్టీ పెట్టి ఓడించారని మాన్ గుర్తు చేశారు. అలాగే 15 ఏళ్లుగా ఎంసీడీని ఏలుతున్న బీజేపీని ఇప్పుడు మట్టి కరిపించారని తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీని అడ్డుకునేందుకు మొత్తం యంత్రాంగాన్ని బీజేపీ.. ఢిల్లీలో మోహరించిందని ఆరోపించారు. ఢిల్లీ ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని మాన్ అన్నారు. ఢిల్లీ వాసులు విద్వేష రాజకీయాలు ఇష్టపడటం లేదన్నారు.

## ఆప్ ట్రాన్స్‌జెండర్ అభ్యర్థి విజయం



**న్యూఢిల్లీ:** 'ఎంసీడీ నుంచి అవినీతిని పారదోలేందుకు కృషా చేస్తా' అని ఢిల్లీ సుల్తాన్‌పురి 'ఎ' వార్డు నుంచి గెలుపొందిన ఆప్ ట్రాన్స్‌జెండర్ అభ్యర్థి బోబీ తెలిపారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థి వరుణ ధాకాపై 6,714 ఓట్ల తేడాతో బోబీ గెలుపొందారు. పార్టీకి ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికైన తర్వాత, తన నియోజకవర్గాన్ని అందంగా తీర్చిదిద్దాలని, తన పొరుగువారి జీవితాలను మెరుగుపర్చాలని కోరుకుంటున్నట్లు బోబీ చెప్పారు.

# మత్స్యకారుల జీవనోపాధికి ఢోకాలేదు

### కేరళ అసెంబ్లీలో సీఎం విజయన్ ప్రకటన



**తిరువనంతపురం:** అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నప్పుడు సంబంధిత ప్రాంత ప్రజల పునరావాసం, జీవనోపాధికి రక్షణ కల్పించడానికి తమ ప్రభుత్వం అమిత ప్రాధాన్యత ఇస్తుందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. తిరువనంతపురంలో విళింజం ఓడరేవు నిర్మాణానికి వ్యతిరేకంగా నెలల తరబడి ఆందోళన చేస్తున్న మత్స్యకారులు నిరసన విరమించిన ఒక రోజు తర్వాత విజయన్ బుధవారం అసెంబ్లీలో ఓ ప్రకటన చేశారు. అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో వామపక్ష ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే విళింజం ఓడరేవు విషయంలోనూ అమలవుతుందన్నారు. కేరళ సుస్థిర ఆర్థికాభివృద్ధికి పునాది వేసే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదే సమయంలో ప్రాజెక్టులను మానవీయ దృక్పథంతో నిర్మించాలన్న వాస్తవాన్ని మరువరాదని తెలిపారు. మంగళవారం జరిగిన అత్యున్నత స్థాయి భేటీలో నిరసన విరమించాలని దీనికి నాయకత్వం వహిస్తున్న కమిటీ నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆందోళనకారులు లేవనెత్తిన డిమాండ్లు, వాటిపై తీసుకున్న నిర్ణయాల వివరాలను కూడా సీఎం సభకు తెలియజేశారు. 'మత్స్యకారులకు పునరావాసం కల్పించేందుకు ఒకటిన్నరేళ్లలో ఫ్లాట్ల నిర్మాణం పూర్తవుతుంది. రెండు నెలల అద్దె ముందుగానే చెల్లిస్తారు. సెప్టెంబర్ 1, 2022 నాటి ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం నెలవారీ అద్దె రూ.5500 ఇవ్వబడుతుంది' అని ఆయన వివరించారు. పునరావాస కార్యక్రమాలు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చిన విజయన్... నిర్మిస్తున్న ఇళ్ల డిజైన్‌పై చర్చలు జరుపుతామని చెప్పారు. చేపలు పట్టే వలలు , మత్స్యకారుల ఇతర జీవనోపాధి పరికరాల నిర్వహణ కోసం ప్రత్యేక స్థలం కేటాయించనున్నట్లు తెలిపారు. విజింజం ఓడరేవుకు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతాయని, తీర కోతపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన కమిటీ త్వరలో మత్స్యకాం ప్రతినిధులతో చర్చలు జరుపుతుందన్నారు. విపత్తు నిర్వహణ అథారిటీ సముద్రంలోకి వెళ్లకుండా నిషేధించిన రోజుల్లో ఉపాధి కోల్పోవడాన్ని పరిగణనలోకి తీసుకుని మత్స్యశాఖ జాబితాలో ఉన్న మత్స్యకారులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్మాణంలో ఉన్న విళింజం ఓడరేవుకు వ్యతిరేకంగా 130 రోజులుగా మత్స్యకారులు చేపట్టిన నిరసన మంగళవారం విరమించారు. మత్స్యకార నేతలు, సీఎం పినరయి విజయన్ మధ్య చర్చల తర్వాత తాత్కాలికంగా నిరసన విరమిస్తున్నట్లు వారు ప్రకటించారు.

# సరిహద్దులో ఉద్రిక్తం

**ముంబై:** మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు వివాదం మరింత ముదురుతున్నట్లు కనిపిస్తోంది. ఈ అంశంపై రెండు రాష్ట్రాల నేతలు ప్రకటనలు చేసుకోవడం దీనికి మరింత ఆజ్యం పోస్తోంది. ఇదే సమయంలో సరిహద్దులో కొన్ని వాహనాలపై దాడులు చేయడంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. సరిహద్దులో ఆందోళనకర పరిస్థితులకు కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కారణమని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఆరోపించారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటకలోకి ప్రవేశించే వాహనాలపై దాడులు ఆపకుంటే మరో విధంగా స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు. 'సరిహద్దులో నెలకొన్న పరిస్థితులను గమనించిన మహారాష్ట్ర దీనిపై సహనంతో ఉండాలని నిర్ణయించింది. కానీ, దానికీ ఓ హద్దు ఉంటుంది. ప్రస్తుతం అక్కడి పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. వాహనాలపై దాడులు ఆపకుంటే ఆ సహనం వేరే మార్గాన్ని ఎంచుకుంటుంది. ఒకవేళ సరిహద్దులో శాంతిభద్రతలు క్షీణిస్తే అందుకు పూర్తి బాధ్యత కర్ణాటక ముఖ్యమంత్రి, ఆ ప్రభుత్వానిదే. కేంద్రం కూడా ప్రేక్షకపాత్ర వహించొద్దు' అని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ స్పష్టం చేశారు. సరిహద్దులో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఈ వివాదంపై నిర్ణయం తీసుకునే సమయం వచ్చిందన్న ఆయన, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు మహారాష్ట్ర ఎంపీలు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలవనున్నట్లు చెప్పారు. ఇదిలాఉంటే, సరిహద్దు ప్రాంతంలో ఉన్న కన్నడ, మరాఠీ మాట్లాడే గ్రామాలు తమకే చెందినవంటూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన నేతలు ఇటీవల ప్రకటనలు చేయడం తాజా వివాదానికి తెరలేపింది. మహారాష్ట్ర మంత్రులు కర్ణాటకలోకి ప్రవేశించకుండా నిషేధిస్తూ బెళగావి జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయంలో మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలపై రాళ్లు రువ్వి దాడి చేయడంతో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి.

**బస్సులు బంద్**

మహారాష్ట్ర-కర్ణాటక మధ్య సరిహద్దు వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. 1957 నుంచి కొనసాగుతోన్న ఈ సరిహద్దు వివాదం మరింత రాజుకోవడంతో రెండు రాష్ట్రాల అనుకూలవాదులు నిరసన ప్రదర్శనలు చేపట్టడం, వాహనాలపై పరస్పరం దాడులకు దిగడంతో ఆందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో, శాంతి భద్రతలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, బసవరాజ బొమ్మై నిర్ణయించుకున్నారు. ఇద్దరు నేతలు మంగళవారం రాత్రి ఫోన్‌ద్వారా మాట్లాడుకొని సరిహద్దుల్లో నెలకొన్న తాజా పరిస్థితులపై చర్చించుకున్నారు. మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సులపై కర్ణాటకలో నిరసనకారులు దాడులు చేస్తున్న కారణంగా, మహారాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్ర నుంచి కర్ణాటకకు బస్సు సర్వీసులను నిలిపేస్తున్నట్లు మహారాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. కర్ణాటకలో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి కర్ణాటకకు బస్సు సర్వీసులను నిలిపేస్తున్నామని అధికారులు తెలిపారు. బస్సులపై దాడుల నేపథ్యంలో మహారాష్ట్ర పోలీసులు హెచ్చరించిన కారణంగానే తాము బస్సు సర్వీసులను నిలిపివేశామన్నారు. మళ్లీ పోలీసులు క్లియరెన్స్ ఇచ్చిన తర్వాతనే బస్సు సర్వీసులను పున్ణప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

# ప్రజాస్వామ్య విలువల్ని పరిరక్షిస్తారు

### రాజ్యసభ చైర్మన్‌గా ధన్కర్ బాధ్యతలు: ప్రధాని అభినందన

**న్యూఢిల్లీ:** రాజ్యసభ చైర్మన్‌గా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్... ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తారని ప్రధాని మోదీ అన్నారు. బుధవారం పార్లమెంటు శీతాకాల సమావేశాల మొదటిరోజు సభాకార్యక్రమాలను చేపట్టిన ధన్కర్‌కు మోదీ స్వాగతం పలికారు. తొలిసారి బాధ్యతలు నిర్వహిస్తున్న ధన్కర్‌కు దేశంతో పాటు సభ తరపున శుభాకాంక్షలు చెబుతున్నానని ప్రధాని సభలో మాట్లాడుతూ అన్నారు. జీవితంలో ఎంతో కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. 'రైతు పుత్రుడు' అని అభివర్ణించారు. 'ఎన్నో ఆటుపోట్ల నడుమ మీరు ఈ స్థాయికి ఎదిగారు. దేశ ప్రజలకు ఇదెంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. చైర్మన్ పదవికి మరింత వన్నె పెరిగింది' అన్నారు. కిసాన్ పుత్రుడైన ఉపరాష్ట్రపతి సైనిక్ స్కూలులో చదివారని, ఆవిధంగా ఆయనకు జవాన్లతోనూ, కిసాన్లతోనూ సన్నిహిత సంబంధాలున్నాయని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గిరిజన తరగతుల నుంచి వచ్చారని, ఆమెకు ముందు పదవిని చేపట్టిన రామ్‌నాథ్ కోవింద్ కూడా అట్టడుగు వర్గాల నుంచి వచ్చారని గుర్తుచేశారు. న్యాయవాదిగా మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న ధన్కర్‌కు న్యాయ పరమైన విషయాలపై గొప్ప పరిజ్ఞానం ఉందన్నారు. మనం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను గుర్తుచేసుకుంటున్న సమయంలో, జీ20 దేశాల అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయని ప్రధాని గుర్తు చేశారు. అనంతరం ఇటీవల కన్నుమూసిన సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్, ప్రముఖ తెలుగు సినీ నటుడు, మాజీ ఎంపీ ఘట్టమనేని కృష్ణకు రాజ్యసభలో నివాళులర్పించారు.

**చిన్న పార్టీలకు ఎక్కువ సమయం ఇవ్వాలి**

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల ద్వారా ప్రభుత్వ బిల్లులను పరిశీలించేలా చూడాలని, చర్చల సమయంలో చిన్న పార్టీలకు ఎక్కువ సమయం ఇవ్వాలని ప్రతిపక్షసభ్యులు ధన్కర్‌ను కోరారు. సభ సజావుగా సాగేందుకు తమ పార్టీ సహకరిస్తుందని ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హామీ ఇచ్చారు. 'ఈ సభకు సంరక్షకునిగా, మీ ఇతర పాత్రల కంటే ఇక్కడ మీ ఉనికి చాలా పెద్దది' అని ఖర్గే అన్నారు. సమావేశాల వ్యవధి తక్కువగా ఉన్నందున అన్ని ప్రజా సమస్యలను సభలో లేవనెత్తలేకపోతున్నట్లు తెలిపారు. గతంలో ఏడాదికి 100 రోజుల పాటు సభ జరిగేదని, అది 60-70 రోజులకు తగ్గలేదన్నారు. విపక్ష ఎంపీల సంఖ్య ట్రెజరీ బెంచీల కంటే తక్కువగా ఉన్నప్పటికీ, వారికి అనుభవం ఉందని ఖర్గే తెలిపారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుఖేందు శేఖర్ రే మాట్లాడుతూ... పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల ద్వారా బిల్లులను పరిశీలించాలని, మెరుగైన చట్టాల కోసం కమిటీల ఎంపిక చేయాలని అన్నారు. సభలో వారానికి కనీసం ఒక స్వల్ప వ్యవధి చర్చ లేదా కాలింగ్ అటెన్షన్ ఉండాలని కూడా ఆయన అన్నారు. లోక్‌సభతో పోలిస్తే రాజ్యసభలో ముఖ్యమైన చట్టాలపై చర్చకు తక్కువ సమయం కేటాయిస్తున్నారని కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

# నవరత్నాల్లో 'కోనేరు' కమిటీ సిఫార్సులు చేర్చాలి

- 21న రాష్ట్ర భూ సాధన సదస్సు
- పేదల సాగు, నివాస భూములకు పట్టాలివ్వాలి
- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో చేర్చి, పేదలకు భూమి పంపిణీ చేయాలని, దీర్ఘకాలంగా పేదలు సాగు చేసుకుంటున్న, నివాసముంటున్న ప్రభుత్వ భూములకు అన్ని హక్కులతో పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21వ తేదీన విజయవాడలో రాష్ట్ర భూ సాధన సదస్సు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం మాజీ ఎమ్మెల్సీ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగింది. సదస్సుకు పేదలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని సూచించింది.

**'కోనేరు' కమిటీ సిఫార్సుల అమలేది: రామకృష్ణ**

ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమవుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా... కబ్జాదారులకు అండగా ఉండటం దుర్మార్గమన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయడం లేదన్నారు. సాగులో వున్న పేదల భూములకు హక్కులు కల్పించకుండా చాలా ఇబ్బందులు కలిగిస్తున్నారని, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా న్యాయం జరగడం లేదన్నారు. జగనన్న కాలనీల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఉచితంగా ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు, లేదా రూ.5లక్షలు లబ్ధిదారుడికి అందించే వరకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిరంతరం లబ్ధిదారుల దగ్గరకు వెళ్లి సంతకాలు సేకరించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని సూచించారు. పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇచ్చే వరకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ భూములు గుర్తించి నిజమైన పేదలకు ఆ భూములను ఎర్రజెండా నాయకత్వంలో అందించేలా ఉద్యమించాలన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ...ప్రభుత్వ ఆస్తులన్నీ కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు విక్రయిస్తున్నారని దుయ్యబట్టారు. 2022 కల్లా రైతులు ఆదాయం రెండింతలు చేస్తానని ప్రకటించి, ఇంతవరకు దాని అమలుకు చర్యలు చేపట్టలేదన్నారు.

**దళిత, గిరిజన, బలహీన వర్గాలే వ్యవసాయ కార్మికులు: జల్లి విల్సన్**

జల్లి విల్సన్ మాట్లాడుతూ భూమిని నమ్ముకుని నిత్యం కష్టపడుతూ బతుకులీడుస్తున్న వ్యవసాయ కార్మికులు రాష్ట్రంలో 59శాతం ఉన్నారని, అందులో దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలవారే ఎక్కువగా ఉన్నారని వివరించారు. మరోపక్క 5 శాతం ఉన్న భూస్వాముల చేతుల్లో 40 శాతం భూమి ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా భూసంస్కరణలు, అటవీ తదితర చట్టాలు వచ్చినా అందులో ఉండే లొసుగులతో వాటి అమలు సక్రమంగా లేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ భూమితోనే పేదలకు గౌరవం ఉంటుందన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులపై దృష్టి పెట్టి భూ పంపిణీని నవరత్నాల్లో చేర్చాలన్నారు. దీర్ఘకాలికంగా పేదలు సాగు చేసుకుంటున్న సాగు భూములకు, నివాసముంటున్న ప్రభుత్వ స్థలాలకు అన్ని హక్కులతో పట్టాలిచ్చి పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

తీర్మానాలు: తన తండ్రి వైఎస్ఆర్ ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను సీఎం జగన్ నవరత్నాల్లో చేర్చి, పేదలకు భూ పంపిణీ చేపట్టాలని, వ్యవసాయ సాగుభూముల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో రాష్ట్ర భూ సాధన సదస్సు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. సదస్సుకు పేదలను పెద్ద సంఖ్యలో తరలించాలని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ అన్యాక్రాంతమయ్యాయో గుర్తించి, ఫలితాలు సాధించేంత వరకు ప్రత్యక్ష భూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది.

సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సీహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఆర్.వెంకట్రావు, బి.కేశవరెడ్డి, కాబోతు ఈశ్వరరావు, చిన్నం పెంచలయ్య, కలిశెట్టి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్, శ్రీధర్, కె.రాధాకృష్ణ, దగాని సంగీతరావు, లండ వెంకట్రావు, గరుగుబిల్లి సూరయ్య, ఎస్డీ మౌలాలి, దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప పాల్గొన్నారు.

## సీఆర్ ఫౌండేషన్‌లో డయాగ్నోస్టిక్ సెంటర్

**విశాలాంధ్ర–హైదరాబాద్:** సీఆర్ ఫౌండేషన్–రోటరీ క్లబ్ అధ్వర్యంలో నిర్మించనున్న డయాగ్నోస్టిక్ సెంటర్ పనులను రోటరీ ఇంటర్‌నేషనల్ ప్రెసిడెంట్ (2024-25) డా॥ స్టెఫానీ ఎ ఉర్చిక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి డా॥ నారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డా॥ స్టెఫానీ ఎ ఉర్చిక్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ అధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులను వివరించారు. సీఆర్ ఫౌండేషన్ సామాజిక కార్యకలాపాలను ప్రశంసించారు. సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డా॥ నారాయణ మాట్లాడుతూ 25 ఏళ్లుగా నడుపుతున్న సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం, మహిళా సంక్షేమ కేంద్రం, ఆరోగ్య కేంద్ర కార్యకలాపాలు వివరించి, ఆరోగ్య కేంద్రం సేవల విస్తృతిలో భాగంగా డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ అధ్యక్ష/డు వందిత్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ నిషిత్ నాయక్, రోటరీ క్లబ్ అధ్వర్యంలో జరుగుతున్న అనేక ప్రాజెక్ట్‌ను వివరించారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు తల్లా రాజశేఖర్‌రెడ్డి, శరత్ చౌదరి పాల్గొన్నారు. వృద్ధులు, గర్భవతులు, బహుళ ప్రజానీకానికి ఆరోగ్య కేంద్రం అందిస్తున్న సేవలను సీఆర్ ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కూనంనేని రజనీ వివరించారు. సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట రెడ్డి, వందన సమర్పణ చేయగా, కోశాధికారి వీ చెన్నకేశవరావు స్వాగతం పలికారు. వేదికపై సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు పి సంధ్యా కుమారి ఉన్నారు. తొలుత ముఖ్య అతిథి డా॥ స్టెఫానీ ఎ ఉర్చిక్ సీఆర్ ఫౌండేషన్ ఆవరణలో ఉన్న చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

### ప్రపంచ దృష్టి ఆకర్షించేలా
## పెట్టుబడుల సదస్సు జరగాలి

**విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:** ప్రపంచమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు నిర్వహించాలని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత, అపార వనరులు, అనుకూల పరిస్థితులు సదస్సులో ప్రతిబింబించాలన్నారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ప్రభావితమయ్యేలా సదస్సు ఉండాలని పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులకు మంత్రులు మార్గనిర్దేశం చేశారు. వెలగపూడి సచివాలయంలోని రెండో బ్లాక్‌లోగల సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో మంత్రులు బుగ్గన, అమర్‌నాథ్ సమీక్ష నిర్వహించారు. సదస్సు ఏర్పాట్లతో పాటు బ్రాండింగ్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడంలో శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశ మందిరాలు, వేదిక ఏర్పాట్లతో సహా సదస్సుకు సంబంధించి మౌలిక సదుపాయాల ఏర్పాటులో పాటించాల్సిన అంశాలు, రంగాల ప్రాధాన్యత, నేపథ్యం, లోగోకు సంబంధించి బుగ్గన కీలక సూచనలిచ్చారు. మార్చి 3,4 తేదీలలో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుకూలంగా ఉంటుందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. ముఖ్యమంత్రి ఇటీవల ఆవిష్కరించిన లోగో, నేపథ్యాలను బుగ్గనకు అమర్‌నాథ్ తెలిపారు. ఇతర రాష్ట్రాలు పెట్టుబడుల సదస్సులను నిర్వహిస్తోన్న తీరును పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో మంత్రులు చర్చించారు. అతిథులకు అందించే మర్యాదపూర్వక జ్ఞాపికలలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత చాటే వస్తువులు, ప్రత్యేకంగా రూపొందించిన బొమ్మలకు పెద్దపీట వేయాలని పరిశ్రమల మంత్రి ఆదేశించారు. ఏయే దేశాల్లో ఎప్పుడు నిర్వహించాలన్న తేదీలు ఖరారు చేసి రోడ్‌షోల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెడతామని పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికాల వలవన్ తెలిపారు. కేంద్రమంత్రులను, ఆంధ్రప్రదేశ్ మూలాలు ఉన్న ప్రఖ్యాత కంపెనీల సీఈవోలు, ఆయా రంగాలలో ప్రత్యేకత చాటిన వ్యక్తులు ఎవరెవరిని పిలవాలన్న అంశాలపై మంత్రులు అధికారులకు సూచనలు ఇచ్చారు.

# ధరలు, నిరుద్యోగంపై నిలదీద్దాం

**సెలెక్ట్ కమిటీకి కీలక బిల్లులు: ప్రతిపక్షాలు**

**న్యూదిల్లీ:** ధరల పెరుగుదల, నిరుద్యోగం సహా అనేక సమస్యలపై మోదీ సర్కారును నిలదీయాలని, సరిహద్దు భద్రతా పరిస్థితులు, కేంద్ర సంస్థలను మోదీ సర్కారు దుర్వినియోగం చేయడంపై చర్చకు పట్టుబట్టాలని విపక్షాలు నిర్ణయించాయి. పార్లమెంటులో ప్రజాస్వామ్యబద్ధంగా చర్చ జరగాలని, ప్రజల సమస్యలు ప్రస్తావించడానికి ఇదే సరైన వేదికని అభిప్రాయపడ్డాయి. భావ సారూప్యత గల పార్టీలుగా ప్రజలకు సంబంధించిన అన్ని అంశాలను బలంగా సభలో వినిపించాలని నిర్ణయించినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే వెల్లడించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు బుధవారం ప్రారంభం కావడంతో మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి ప్రతిపక్షాలు సమావేశమయ్యాయి. పార్లమెంట్ సజావుగా సాగేందుకు సహకరిస్తామని, అయితే, కీలక బిల్లులను జేపీసీ లేదా సెలెక్టు కమిటీకి పంపాలని విపక్షాలు నిర్ణయించినట్లు ఖడ్గే ట్విట్టర్ ద్వారా తెలిపారు. అయితే, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే నేతృత్వంలో జరిగిన ప్రతిపక్షాల సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ హాజరయ్యాయి.

# సీఎంవో అధికారుల శాఖలివే!

- పూనం మాలకొండయ్యకు అత్యధికంగా 10 శాఖలు
- ధనుంజయరెడ్డికి-7, ముత్యాలరాజుకు-7, భరత్ గుప్తాకు-6

**విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:** ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) అధికారులకు బుధవారం కొత్తగా శాఖల కేటాయింపు చేశారు. ఇటీవల సీఎంవోలో ఉన్న అధికారుల్లో జవహర్‌రెడ్డి, ఆరోఖ్య రాజ్ వేరే బాధ్యతలు స్వీకరించడంతో వారు అప్పటివరకూ చూస్తున్న శాఖల్ని ఇతరులకు అప్పగించారు. దీంతో ఇప్పటికే సీఎంవోలో ఉన్న అధికారులకు కొత్త శాఖలు దక్కాయి. మిగతావారి శాఖల్లోనూ మార్పులు జరిగాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధానకార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య ఉత్తర్వులు జారీ చేశారు. దీనిప్రకారం సీనియర్ ఐఏఎస్‌లు పూనం మాలకొండయ్యకు 10 శాఖలు, ధనుంజయ రెడ్డికి 7 శాఖలు, ముత్యాలరాజుకి 7 శాఖలు, నారాయణ్ భరత్ గుప్తాకు 6 శాఖలు కేటాయించారు. సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న పూనం మాలకొండయ్యకు సాధారణ పరిపాలన శాఖతో పాటు విద్య, వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వ్యవసాయం, సంబంధిత శాఖలు, పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక సౌకర్యాలు, పెట్టుబడులు, ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, మార్కెటింగ్, సహకారం, మహిళా, శిశుసంక్షేమం, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం బాధ్యతలు అప్పగించారు. సీఎం కార్యదర్శిగా ఉన్న ధనుంజయరెడ్డికి ఆర్థిక, ప్రణాళిక, హోం, జలవనరులు, పురపాలక, విద్యుత్, పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక, గనులు, జియాలజీ శాఖలు కేటాయించారు. సీఎం అదనపు కార్యదర్శి ముత్యాలరాజుకు రెవెన్యూ, న్యాయ, కార్యనిర్వాహక, భూములు, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు, సర్వే, సీఎంఆర్‌ఎఫ్, విపత్తుల నిర్వహణ, రవాణా, రోడ్లు, భవనాలు, కార్మిక, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సీఎంవో ఎస్టాబ్లిష్‌మెంట్ శాఖలు కేటాయించారు. సీఎం సంయుక్త కార్యదర్శి నారాయణ భరత్ గుప్తాకు గృహ, పంచాయతీరాజ్, సచివాలయాలు, ఐటీ, సంక్షేమశాఖలు, సీఎం ఇచ్చే హామీలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే వినతుల వ్యవహారాలను అప్పగించారు.

## మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్ జాబితా విడుదల

**మొదటి స్థానంలో ధనుష్, నాలుగులో చెర్రీ, ఎనిమిదిలో తారక్**

**న్యూదిల్లీ:** ఈ ఏడాది చివరి దశకు చేరుకున్నాం. మరి కొన్నిరోజుల్లో ఈ సంవత్సరానికి గుడ్‌బై చెప్పనున్నాం. ఈ నేపథ్యంలో 2022కు సంబంధించిన మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్ జాబితాను ఐఎండీబీ విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 200 మిలియన్లకు పైగా సినీ ప్రియుల అభిప్రాయాలను ఆధారంగా చేసుకుని ఈ ర్యాంకింగ్స్‌ను వెల్లడించినట్లు సదరు సంస్థ పేర్కొంది. సుమారు 10 మంది పేర్లతో ఉన్న ఈ జాబితాలో ధనుష్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఇక, అలియాభట్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్, సమంత, కియారా అద్వాణీ సైతం ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. 1. ధనుష్ 2. అలియా భట్ 3. ఐశ్వర్యారాయ్ బచ్చన్ 4. రామ్‌చరణ్ 5. సమంత 6. హృతిక్ రోషన్ 7. కియారా అద్వానీ 8. ఎన్టీఆర్ 9. అల్లు అర్జున్ 10.యశ్. ఇక, ఉత్తమ నటుడిగా భారతదేశంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ధనుష్ ఈ ఏడాది హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. హాలీవుడ్ చిత్రం 'ది గ్రే మ్యాన్'లో ఆయన కీలకపాత్ర పోషించారు. జులైలో విడుదలైన ఈ సినిమా అంతటా మంచి టాక్ అందుకుంది. మరోవైపు అలియాభట్ సైతం ఇదే ఏడాదిలో హాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆమె ముఖ్య భూమిక పోషిస్తోన్న 'హార్ట్ ఆఫ్ స్టోన్స్' షూట్ ఇటీవల పూర్తైంది. అలాగే, 'ఆర్‌ఆర్‌ఆర్'తో చరణ్, తారక్, 'పుష్ప'తో అల్లు అర్జున్, 'కేజీయఫ్'తో యశ్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సొంతం చేసుకున్నారు.

## వచ్చేనెల 13న 'వాల్తేర్ వీరయ్య'

**హైదరాబాద్:** మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీల క్రేజీ కాంబినేషన్‌లో, మెగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'వాల్తేర్ వీరయ్య'. 2023 సంక్రాంతికి విడుదల కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి తాజాగా విడుదల తేదీని నిర్మాతలు ప్రకటించారు. ఇప్పటికే సంక్రాంతి బరిలో ఉన్న సినిమాలకు సంబంధించి.. విడుదల తేదీలు ఫిక్స్ చేసుకుంటున్న తరుణంలో.. మెగాస్టార్ చిరంజీవి కూడా తన సినిమా విడుదలకు సంబంధించిన డేట్‌ని లాక్ చేశారు. 2023, జనవరి 13న, ప్రపంచవ్యాప్తంగా వీరయ్య ఆగమనం అని తెలుపుతూ.. తాజాగా మేకర్స్ ఓ పోస్టర్ వదిలారు. ఈ పోస్టర్‌లో మెగాస్టార్‌ని చూసిన వారికి నిజంగానే పూనకాలు రావడం ఖాయం. మాసీ లుక్‌లో మెగాస్టార్ అదుర్స్ అనిపిస్తున్నారు. బోట్‌పై నిలబడి.. తీక్షణంగా చూస్తున్నారు. ఆయన చేతిలో ఉన్న ఈటెని చూస్తుంటే.. సముద్రంలో పెద్ద యుద్ధమే జరగబోతుందనేది అర్థమవుతోంది. మొత్తంగా మాత్రం.. ఈ లుక్‌తో ఫ్యాన్స్‌కి ముందుగానే పండగ వాతావరణం క్రియేట్ చేశారు. మెగాస్టార్ చిరంజీవికి వీరాభిమాని అయిన దర్శకుడు బాబీ కొల్లి, మెగాస్టార్‌ని ఇంతకు ముందెన్నడూ చూడని క్యారెక్టర్‌లో ప్రజంట్ చేస్తున్నారు. మరో వీరాభిమాని దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. చిరంజీవి సరసన శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో మాస్ మహారాజా రవితేజ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇక విడుదల తేదీని ప్రకటిస్తూ విడుదలైన పోస్టర్.. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## సీత పాత్రతో బాలీవుడ్‌లోకి సాయి పల్లవి

**ముంబై:** ప్రేమమ్ సినిమాతో ఇండస్ట్రీకి వచ్చిన అందాల భామ సాయి పల్లవి. 'ఫిదా', 'లవ్‌స్టోరీ', 'గార్గి' వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. సాయి పల్లవికి సౌత్‌లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఈ అందాల భామ త్వరలోనే బాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనున్నట్టు సమచారం అందు తుంది. బీ టౌన్ హీరో రణ్‌బీర్ కపూర్‌తో రొమాన్స్ చేయనుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ నిర్మాత మధుమంతెన రామాయణాన్ని సిల్వర్ స్క్రీన్ మీదకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించనున్నాడు. సీత పాత్రను సాయిపల్లవి పోషించనుందని బీ టౌన్ మీడియా తెలుపుతోంది.

ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. మేకర్స్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుతున్నారు. ఈ చిత్రం 2023 సెప్టెంబర్‌లో పట్టాలెక్కనుందని తెలుస్తోంది. సీత పాత్ర కోసం మేకర్స్ గతంలో దీపికా పదుకొణె, కరీనా కపూర్‌లను సంప్రదించారని రూమర్స్ హల్‌చల్ చేశాయి. ఇక సాయిపల్లవి కెరీర్ విషయానికి వస్తే.. 'విరాటపర్వం', 'గార్గి' చిత్రాల్లో చివరగా ఆమె నటించింది. ఈ సినిమాలు అభిమానుల మెప్పు పొందనప్పటికి విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్నాయి.

# పద్దెనిమిది నెలల్లో యుద్ధం

- 2024...చంద్రబాబుకు చివరి ఎన్నికలే
- ప్రభుత్వ మంచిని గడగడపకూ తీసుకెళ్లాలి
- జయహో బీసీ మహాసభలో జగన్ దిశానిర్దేశం

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** టీడీపీ హయాంలో బీసీలకు అన్యాయం జరగ్గా ఇవాళ రాజ్యాధికారంలో బీసీలు భాగస్వాములయ్యారని, ఇదే విషయాన్ని ప్రతిపక్ష నేతకు చెప్పాలని వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే 18 నెలల్లో రాష్ట్రంలో జరగబోయే యుద్ధం నిజాయతీ, వెన్నుపోటుకు మధ్య జరగబోతోందని చెప్పండంటూ దిశానిర్దేశం చేశారు. అధికార వైసీపీ విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో బుధవారం జయహో బీసీ మహాసభ నిర్వహించింది. అన్ని జిల్లాల నుంచి పంచాయతీ వార్డు మెంబరు నుంచి రాజ్యసభ సభ్యుల వరకూ దాదాపు 85 వేల మంది బీసీ ప్రతినిధులు ఈ సభకు హాజరయ్యారు. ఈ సభలో ముఖ్య ప్రసంగం చేసిన సీఎం జగన్... 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మాట్లాడారు. మాట మీద నిలబడే నాయకత్వానికీ, ప్రజలకు వెన్నుపోటు పొడిచే మనస్తత్వానికి మధ్య, సామాజిక న్యాయానికి, సామాజిక అన్యాయానికి మధ్య, పేదల భవిష్యత్‌కు, పేదలు పేదలుగానే మిగిలిపోవాలనే తాపత్రయపడే పెత్తందార్లకు మధ్య యుద్ధం జరగబోతుందన్నారు. ఈ విషయాలన్నిటినీ ప్రతి జిల్లా, నియోజకవర్గాలలో గడపగడపకూ తీసుకెళ్లాలని, తేడా గమనించాలని అందర్నీ అడగాలంటూ కోరారు. జగన్ ఏదైతే చెబుతారో అదే చేస్తాడని, చంద్రబాబును మాత్రం నమ్మొద్దని, ఎన్నికల సమయంలో రంగురంగుల స్వప్నాలను చూపిస్తారంటూ చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మన బతుకులు మారాయా? లేదా? అనేదీ గుండెమీద చేయివేసుకుని ఆలోచించాలని, ప్రతి గడప గడపకూ వెళ్లాలని కోరారు. 2024 ఎన్నికలు ఖచ్చితంగా చంద్రబాబుకు చివరి ఎన్నికలేనని అన్నారు. 2024లో వైసీపీకి ఇంతకు మించిన గెలుపు ఖాయమని స్పష్టం చేశారు.

**మారు వేషాల్లో వస్తున్నారు...జాగ్రత్త: తమ్మినేని**

అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ... బీసీలు జడ్జీలుగా పనికిరారని లేఖలు రాసిన వాళ్లు మళ్లీ మారు వేషాల్లో మన దగ్గరకు వస్తున్నారు...తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన మాటకు కట్టుబడి బీసీల కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న యువ సీఎం వైఎస్ జగన్ పాలనలో బీసీలంతా క్షేమంగా ఉన్నారన్నారు. సభకు అధ్యక్షత వహించిన వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ... జగన్ పరిపాలనలో బీసీల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఈ సభకు వచ్చింది కార్యకర్తలు కాదనీ, 85 వేల మంది ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు మాత్రమేనని నొక్కిచెప్పారు. వీళ్లందరినీ తయారు చేసింది సీఎం జగన్ అని కొనియాడారు. బీసీల వాటా బీసీలకు ఇస్తానని చేసి చూపించిన దమ్మున్న నాయకుడు మాత్రం జగనేనని స్పష్టం చేశారు. సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ఇన్నాళ్లూ బీసీల వెనుకబాటుకు కారకుడు చంద్రబాబేనని విమర్శించారు. మంత్రులు జోగి రమేశ్, కారుమూరి నాగేశ్వరరావు, సీదిరి అప్పలరాజు, విడదల రజిని, గుమ్మనూరు జయరామ్, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ... బీసీలకు ఇన్ని పదవులు ఇచ్చిన నాయకుడు జగన్ మాత్రమేనని అన్నారు. సభకు హాజరైన బీసీ ప్రతినిధుల కోసం ప్రత్యేక వంటకాలతో భోజన ఏర్పాట్లు చేశారు. 9రకాలతో అల్పాహారం, 21రకాల వంటకాలతో భోజనాలు వడ్డించారు. బీసీ మహాసభలో మంత్రులు బొత్స సత్యనారాయణ, మంత్రి అంజాద్ బాషా, రాజ్యసభ సభ్యులు పిల్లి సుబాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్‌రావు, ఎంపీలు మార్గాని భరత్, గోరంట్ల మాధవ్, సత్యవతి, డాక్టర్ సంజీవ్ కుమార్, బీసీ ఎమ్మెల్యేలు, కాపు రామచంద్రారెడ్డి, కొలుసు పార్థసారథి, శంకర నారాయణ, ధర్మాన కృష్ణదాస్, కరణం ధర్మశ్రీ, అదీప్ రాజ్, హఫీజ్ ఖాన్, ముస్తాఫా, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు భరత్, దువ్వాడ శ్రీనివాస్, వరుదు కళ్యాణి, పోతుల సునీత, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, గ్రామ స్థాయి వార్డు సభ్యుల నుంచి పార్లమెంటు వరకు వివిధ పదవుల్లో ఉన్న బీసీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.